# ఆదిలాబాద్ వార్త



మంచిర్యాల, కొమురం భీం ఆసిఫాబాద్, నిర్మల్

శుక్రవారం 14, ఆగస్టు 2026




వర్షం పడితే ఆ గ్రామానికి

# రాకపోకలు బంద్

✦ వంతెన లేక అవస్థలు ✦ గ్రామ ప్రజలు ఎటు వెళ్లలేని పరిస్థితి

దహెగాం, ఆగస్టు 13, ప్రభాతవార్త :

దహెగాం మండలంలోని పెసరికుంట గ్రామపంచాయతీ పరిధిలోని మురళీగూడ గ్రామ ప్రజలు ఒర్రె దాటందే రోజువారీ పనులకు పూర్తికావు నిత్యావసర పనులకు పొలం పనులకు వెళ్లాలన్న ఒర్రె దాటి పనులకు వెళ్ళాలి వర్షాకాలం వచ్చిందంటే పనులకు వెళ్లాలన్న, ఇంట్లో నిత్యావసర సరుకులు తెచ్చుకోవాలన్నా చాలా ఇబ్బందులు పడుతున్నారు.అనారోగ్యం పాలైతే అత్యవసరంగా వెళ్లాలన్న అంబులెన్సు రాదు ఎటు వెళ్లలేని పరిస్థితి ఒర్రెకు వంతెన నిర్మించాలని ప్రభుత్వాన్ని గ్రామ ప్రజలు వేడుకుంటున్నారు.





2లో..

ఆరోగ్య పరీక్ష పరికరాల ద్వారా

# మెరుగైన వైద్యం అందించాలి

కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి, ఆగస్టు 13, ప్రభాతవార్త :

జిల్లాలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను రోగులకు ఆరోగ్య పరీక్ష పరికరాల ద్వారా పరీక్షలు నిర్వహించి మెరుగైన వైద్యం అందించాలని జిల్లా కలెక్టర్ కె.హరిత అన్నారు. గురువారం సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలోని ఎన్ఐసి సమావేశ మందిరంలో స్క్రీనింగ్ పరికరాల వినియోగంపై ల్యాబ్ టెక్నీషియన్లు, స్టాఫ్ నర్సులకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమానికి జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి నాగేంద్ర తో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ కార్పొరేట్ సంస్థల సామాజిక బాధ్యతలో భాగంగా హిందుస్థాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్ వారి ఆధ్వర్యంలో ఓమ్ని ఆక్టివ్ కేర్ ఫౌండేషన్ వారి సహకారంతో హెల్త్ ప్రాజెక్ట్ కాంట్రిబ్యూషన్ లో భాగంగా అందించిన హెల్త్ స్క్రీనింగ్ పరికరాలు, మల్టీ పారామెట్రిక్ డయాగ్నొస్టిక్ డివైస్ లను వినియోగించుకుని తమ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు చికిత్సల కోసం వచ్చే రోగులకు పరీక్షలు నిర్వహించి మెరుగైన వైద్యం అందించాలని తెలిపారు. ప్రస్తుతం జిల్లాలో 8 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు పరికరాలను అందించడం జరిగిందని, స్క్రీనింగ్ పరికరాల నిర్వహణపై అవగాహన కలిగి ఉండాలని, మారుమూల గ్రామాల ప్రజలకు ఉత్తమమైన వైద్య సేవలు అందించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆకాంక్షిత బ్లాక్ సమన్వయకర్త డా. బాలరాజు, స్టాఫ్ నర్సులు ల్యాబ్ టెక్నీషియన్లు పాల్గొన్నారు.



శాంతిభద్రతల పరిరక్షణలో నిర్లక్ష్యాన్ని

# ఏమాత్రం సహించేది లేదు

- పెండింగ్ కేసులను త్వరితగతిన తేల్చాలని, 5ఎస్ విధానాన్ని పాటించాలి
- రామగుండం సీపీ అంబర్ కిశోర్ ఝా
- శ్రీరాంపూర్ పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేసిన సీపీ

నస్పూర్, ఆగస్టు 13, ప్రభాతవార్త

శాంతిభద్రతల పరిరక్షణలో నిర్లక్ష్యాన్ని ఏమాత్రం సహించేది లేదని రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిశోర్ ఝా స్పష్టం చేశారు. మంచిర్యాల జోన్ పరిధిలోని శ్రీరాంపూర్ పోలీస్ స్టేషన్‌ను గురువారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్టేషన్ పరిసరాలు, వివిధ నేరాలకు సంబంధించి స్వాధీనం చేసుకున్న వాహనాల భద్రతను పరిశీలించిన కమిషనర్, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడంతో పాటు వాహనాలను క్రమపద్ధతిలో భద్రపరచాలని ఆదేశించారు. పోలీస్ స్టేషన్‌లో 5ఎస్ విధానాన్ని అమలు చేసి, అన్ని రికార్డులను క్రమపద్ధతిలో నిర్వహించాలని సూచించారు. దర్యాప్తులో ఉన్న కేసుల వివరాలు, ప్రస్తుత స్థితిగతులు, నిందితుల అరెస్టులు, పెండింగ్ కేసులకు గల కారణాలను ఇన్స్పెక్టర్ ఏ. అశోక్, ఎస్ఐ ఎం. సంతోష్‌లను అడిగి తెలుసుకున్నారు. పెండింగ్ కేసులను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. ఎస్ఐ, స్టేషన్ రైటర్, సీసీటీఎన్ఎస్ రైటర్లతో మాట్లాడి ఆన్‌లైన్ వివరాల నమోదు, రికార్డుల అప్‌లోడ్ ప్రక్రియను సమీక్షించారు. విధుల్లో ఉన్న బ్లూకోట్స్ సిబ్బందితో ఫోన్‌లో మాట్లాడి వారి స్థాన వివరాలు తెలుసుకున్నారు. కోర్టు విధుల్లో ఉన్న సిబ్బందితో మాట్లాడి, ఆ రోజు విచారణకు ఉన్న కేసుల సమాచారం సేకరించారు. అనంతరం కమిషనర్ మాట్లాడుతూ విజిబుల్ పోలీసింగ్‌పై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. నేరాల నియంత్రణకు అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడే వారిని ఏమాత్రం ఉపేక్షించవద్దని, రౌడీషీటర్లు, హిస్టరీషీటర్లపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలని స్పష్టం చేశారు. పోలీసు అధికారులు, సిబ్బంది సంక్షేమానికి ప్రాధాన్యత ఇవ్వాలని, వారి సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. సిబ్బందికి క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు నిర్వహించి, వారి ఆరోగ్య పరిరక్షణకు అవసరమైన చర్యలు చేపట్టాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో శ్రీరాంపూర్ పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



# కలెక్టరేట్ ఎదుట వట్టివాగు ఆయకట్టుదారుల ఆందోళన

ఆసిఫాబాద్ టౌన్, ఆగస్టు 13, ప్రభాతవార్త

వట్టివాగు ప్రాజెక్టు నుంచి సాగునీటిని విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ గురువారం వట్టివాగు ఆయకట్టుదారులు కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేపట్టారు. అనంతరం కలెక్టర్ హరితకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ గత నెలలో ప్రాజెక్టులో నీరు లేకపోవడంతో వరి నాట్లు వేయవద్దని అధికారులు సూచించారని తెలిపారు. ప్రస్తుతం ప్రాజెక్టులో పుష్కలంగా నీరు ఉన్నప్పటికీ కాలువలకు సాగునీటిని విడుదల చేయడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో వెంటనే ప్రాజెక్టు నుంచి నీటిని కాలువలకు విడుదల చేసి పంటలను కాపాడాలని కోరారు. ఈ కార్యక్రమంలో రైతు ప్రతినిధులు, సింగిల్ విండో చైర్మన్ సంజీవ్, ఇతర రైతు నాయకులు పాల్గొన్నారు.



# ఉచిత కంటి, చిన్నారుల వైద్య శిబిరం

**జైనూర్, ఆగస్టు13,ప్రభావార్త;**



సమావేశంలో మాట్లాడుతున్న సర్పంచ్ రాజశేఖర్

శ్రీ గణేష్ హాస్పిటల్, ఆదిలాబాద్ వారి ఆధ్వర్యంలో జైనూర్ మండల కేంద్రంలోని మార్కెట్ యార్డులో గురువారం ఉచిత కంటి, చిన్నారుల వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలను ఉచితంగా అందించాలనే ఉద్దేశంతో ఏర్పాటు చేసిన ఈ శిబిరానికి విశేష స్పందన లభించింది. ఈ ఉచిత వైద్య శిబిరాన్ని మార్కెట్ కమిటీ చైర్మన్ కుడుమెత విశ్వనాథ్, స్థానిక సర్పంచ్ కొడప ప్రకాష్, లింగాపూర్ మండల సర్పంచ్ జాదవ్ రాజశేఖర్ ముఖ్య అతిథులుగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మారుమూల ప్రాంత ప్రజలకు నిపుణులైన వైద్యుల ద్వారా ఉచిత వైద్య సేవలు అందించడం అభినందనీయమని అన్నారు. ప్రజల ఆరోగ్య పరిరక్షణ కోసం ఇలాంటి శిబిరాలను మరిన్ని ప్రాంతాల్లో నిర్వహించాలని ఆకాంక్షించారు. శ్రీ గణేష్ హాస్పిటల్‌కు చెందిన కంటి వైద్య నిపుణులు కృష్ణ ప్రసాద్ చౌహన్ ఆధ్వర్యంలో కంటి పరీక్షలు నిర్వహించగా, పిల్లల వైద్య నిపుణులు డాక్టర్ దివ్యజ్యోతి చౌహాన్ చిన్నారులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఆరోగ్య సంబంధిత సూచనలు, సలహాలు అందించారు. శిబిరంలో కంటి సమస్యలు, దృష్టి లోపాలు తదితర సమస్యలకు సంబంధించి వైద్య పరీక్షలు నిర్వహించడంతో పాటు, చిన్నారుల ఆరోగ్య పరిస్థితిని వైద్యులు పరిశీలించారు. అవసరమైన వారికి తదుపరి చికిత్స పై తగిన సూచనలు అందించారు. ఈ కార్యక్రమంలో అడే లక్క్యా నాయక్, మాజీ జెడ్పీటీసీ, డాక్టర్ సురేష్, జాటోత్ రాహుల్ తదితరులు పాల్గొన్నారు. వైద్య శిబిరం నిర్వహించిన శ్రీ గణేష్ హాస్పిటల్ యాజమాన్యం, వైద్య బృందాన్ని పలువురు అభినందించారు.

## రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీని వెంటనే అమలు చేయాలి

- హమాలీలకు వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు చేయాలి
- ఆల్ హమాలి యూనియన్ సిఐటియు జిల్లా అధ్యక్షులు గోమాస ప్రకాష్

**లక్షెట్టిపేట, ఆగస్టు 13, ప్రభాతవార్త**



హమాలీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా లక్షెట్టిపేట తహసీల్దార్ ఆఫీస్ ముందు ధర్నా చేసి తహసీల్దార్‌కు వినతి పత్రం ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా గోమాస ప్రకాష్ ఆల్ హమాలీ వర్కర్స్ యూనియన్ సిఐటియు జిల్లా అధ్యక్షులు మాట్లాడుతూ... ఎటువంటి భద్రత లేని హమాలీ కార్మికుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని, ఎన్నికల ముందు ఇచ్చిన హామీ ప్రకారం కాంగ్రెస్ ప్రభుత్వం హమాలీలకు వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు చేయాలని, ఇన్సూరెన్స్, ప్రమాద బీమా సౌకర్యం కల్పించాలని, హమాలీలకు ప్రభుత్వ పథకాలు అమలు చేయాలని, తదితర సమస్యల పరిష్కారం కోసం జిల్లాలో ఉన్న రైస్ మిల్ హమాలి, బజార్ హమాలీలు, గోడౌన్స్ హమాలీలు, ఐకెపి, గ్రామీణ హమాలీలు అందరూ హక్కుల సాధనకై భవిష్యత్తులో ఐక్యంగా పోరాటాల్లోకి రావాలని విజ్ఞప్తి చేస్తున్నాం అని అన్నారు. ఈ కార్యక్రమంలో టి. చిన్నయ్య జిల్లా కార్యదర్శి, ఎం. కొమురయ్య జిల్లా ఉపాధ్యక్షులు, ఎం గంగయ్య, ఎం రామచంద్ర, పద్మారావు సహాయ కార్యదర్శి, నాయకులు నరసయ్య, టి సత్తయ్య, జి సురేష్ , బి తిరుపతి, సిహెచ్ దానయ్య , టి రాజయ్య, టి. జయరాజ్, ఈ. వెంకటేష్, బి. జార్జ్ తదితరులు పాల్గొన్నారు.

## స్కాలర్‌షిప్ బకాయిలు వెంటనే విడుదల చేయాలి

### విద్యార్థులపై ఫీజుల భారం మోపొద్దు: ఎస్ఎఫ్ఐ

**మంచిర్యాల, ఆగస్టు 13, ప్రభాతవార్త**

పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో మంచిర్యాల ఐబీ చౌరస్తాలోని అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా కన్వీనర్ దాగం శ్రీకాంత్ మాట్లాడుతూ రాష్ట్రంలో సుమారు రూ.10,800 కోట్ల స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు పెండింగ్‌లో ఉండటంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. బకాయిల కోసం ప్రైవేటు, కార్పొరేట్ కళాశాలలు విద్యార్థులపై ఒత్తిడి చేయడం, చదువు పూర్తయిన వారికి ధ్రువపత్రాలు నిలిపివేయడం సరికాదన్నారు. ప్రభుత్వం తక్షణమే బకాయిలను విడుదల చేసి, విద్యార్థులపై వేధింపులు అరికట్టాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో పెద్దఎత్తున ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో జిల్లా కో కన్వీనర్ విష్ణు ప్రసాద్, పట్టణ నాయకులు ప్రణయ్, రామ్‌చరణ్ తేజ, విద్యార్థులు పాల్గొన్నారు.




## స్వాతంత్ర దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించాలి

**ఆసిఫాబాద్, ఆగస్టు 13, ప్రభాతవార్త :**

ఈ నెల 15న 80వ స్వాతంత్ర దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ కె.హరిత అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని పోలీస్ పరేడ్ మైదానాన్ని జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) ఎం. డేవిడ్, జిల్లా రెవెన్యూ అధికారి దాసరి వేణు, ఆసిఫాబాద్ రాజస్వ మండల అధికారి లోకేశ్వర్ రావు లతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ వేడుకలలో భాగంగా వేదిక అలంకరణ, ప్రముఖులు, మీడియా గ్యాలరీ, అధికారులు, ప్రజలు కూర్చుని గ్యాలరీలలో అవసరమైన ఏర్పాట్లు చేయాలని తెలిపారు. షామియానాలు, కుర్చీలు, సౌండ్ సిస్టం, స్టాల్ ఏర్పాటు స్థలం, విద్యార్థుల నృత్య ప్రదర్శన స్థలాన్ని చదును చేయాలని అధికారులకు సూచించారు. ఎలాంటి అసౌకర్యం కలగకుండా త్రాగునీరు, నిరంతర విద్యుత్ సరఫరా, పారిశుద్ధ్య పనులు చేపట్టాలని తెలిపారు. అంతకుముందు పోలీస్ పరేడ్ మైదానానికి చేరుకున్న జిల్లా కలెక్టర్ పోలీసు గౌరవ వందనం స్వీకరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులు నదీమ్, సురేష్, సిద్దిక్, పోలీస్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## కెరమెరిలో ఘనంగా మండల కాంగ్రెస్ పార్టీ కార్యాలయ ప్రారంభోత్సవం

**కెరమెరి,ఆగస్టు 13, ప్రభాతవార్త:**



కెరమెరి మండల కాంగ్రెస్ పార్టీ నూతన కార్యాలయాన్ని గురువారం ఘనంగా ప్రారంభించారు. డీసీసీ అధ్యక్షురాలు ఆత్రం సుగుణక్క, నియోజకవర్గం ఇంచార్జి అజ్మీరా శ్యాంనాయక్ ముఖ్య అతిథులుగా హాజరై నూతన కార్యాలయాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మహ్మద్ సుజాయిత్ ఖాన్ ను డీసీసీ అధ్యక్షురాలు ఆత్రం సుగుణక్క, నియోజకవర్గం ఇంచార్జి అజ్మీరా శ్యాంనాయక్, మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ ఇరుకుల మంగ శాలువాతో సన్మానించారు. అనంతరం కార్యాలయ ఆవరణలో కాంగ్రెస్ పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డీసీసీ అధ్యక్షురాలు ఆత్రం సుగుణక్క మాట్లాడుతూ, కాంగ్రెస్ పార్టీకి మండల స్థాయిలో పార్టీ కార్యాలయం ఎంతో కీలకమన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలకు అందుబాటులో ఉండేలా కార్యాలయాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి ప్రతి కార్యకర్త సమన్వయంతో పనిచేయాలని, గ్రామస్థాయి నుంచి పార్టీని మరింత పటిష్టం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కోవా ఇందిరా, మారుతి పటేల్, సాజిద్ దేశముఖ్, రాథోడ్ శంకర్ నాయక్, వాగ్మారే శ్రీకాంత్, మొహర్లే పోశెట్టి, మొహర్లే రమేష్, రాథోడ్ జలపత్ , వడైయి శ్రీకాంత్ , డా. ముండే మహదేవ్, షేక్ రహుఫ్, షేక్ మహమ్మద్, సొంకంబ్లె మిలింద్ కుమార్, రాథోడ్ రవి నాయక్, గుండి బాపురావు, రోహిదాస్ సిలోత్ , చాటారే హనుమంతు , శంశు ఖాన్, రాథోడ్ సక్లాల్, షేక్ హుస్సేన్, మురళి గంటేవాడ్, పిట్ల ఆనందరావు, షేక్ ఫరూక్ ,రాథోడ్ దేవీదాస్,ప్రకాష్ జాదవ్, గోగర్ల రాజయ్యా, సిడఎమ్ జగన్నాథ్, మొహాలీ బాపురావు,కర్పెత విమల బాయి, శంకర్, కోట్రంగే తిరుపతి యూత్ కాంగ్రెస్, నాయక్,రాథోడ్ ధర్మ సింగ్, మొహర్లే బాపురావు, సెండే హనుమంతు,కోట్రంగే నాగు పటేల్, రాథోడ్ సాకారం,కోట్రంగే హనుమంతు, రాథోడ్ సుదర్శన్,రాథోడ్ సకారం నాయక్ , మాడవి రాజు,పిట్ల గిడ్డప్ప, అదే దిలీప్, కనక మనోహర్, ఆత్రం తిరుపతి,షేక్ మూస సాబ్, వాడయి అన్నారావు , చాటారే శంకర్, గుగ్లోత్ అన్నజ్,రాథోడ్ విజేష్ నాయక్, ఆత్రం రాజు, భూపేందర్, దేవేందర్, పెందుర్ వినయ్, ఆత్రం చిత్రూ, కోవా బాదిరావు,. కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## వర్షం పడితే ఆ గ్రామానికి
# రాకపోకలు బంద్

(మొదటిపేజీ తరువాయి)

### వంతెన నిర్మించాలి, సతీష్ కుమ్మరి సర్పంచ్, పెసరికుంట గ్రామపంచాయతీ



గ్రామ ప్రజలు రోజువారీ పనులు చేసుకోవాలన్నా ఒర్రెకు వంతెన లేక అంతరాయం కలుగుతుంది ఒర్రెకు వంతెన నిర్మించాలి వైద్య సదుపాయాలు లేవు వర్షాకాలంలో అత్యవసర వేల అంబులెన్సులు రావు అధికారులు స్పందించి వంతెన నిర్మాణానికి కృషి చేయాలి.

### వంతెన నిర్మించి మా కష్టాలు తీర్చండి..



ఒర్రెకు వంతెన నిర్మించి మా గ్రామ ప్రజల కష్టాలు తీర్చండి వర్షాకాలంలో మేము ఎటు వెళ్లలేని పరిస్థితి అనారోగ్యం అయితే బయటకి వెళ్లలేము వైద్య సదుపాయం లేదు నిత్యావసర సరుకులు తెచ్చుకోవాలన్నా ప్రక్క గ్రామానికి వెళ్లలేని పరిస్థితి అధికారులు, ప్రజాప్రతినిధులు మా గోడును విని వంతెన నిర్మించి మా గ్రామ ప్రజల కష్టాలు తీర్చాలని వేడుకుంటున్నాము.

## కోడి పందేల స్థావరంపై టాస్క్‌ఫోర్స్ మెరుపుదాడి

### - బెట్టింగ్ నిర్వహిస్తున్న 16 మంది అరెస్ట్.. రూ.24 వేల నగదు, 18 బైక్‌లు, 45 కత్తులు స్వాధీనం

**వేమనపల్లి, ఆగస్టు 13, ప్రభాతవార్త**



కోడి పందేల పేరుతో బెట్టింగ్ నిర్వహిస్తున్న స్థావరంపై రామగుండం టాస్క్‌ఫోర్స్ పోలీసులు మెరుపుదాడి చేసి 16 మందిని అరెస్ట్ చేశారు. వేమనపల్లి మండలం కల్లెంపల్లి గ్రామ శివారులో బుధవారం అర్ధరాత్రి జరిగిన ఈ దాడిలో పెద్ద మొత్తంలో నగదు, వాహనాలు, కత్తులు, కోళ్లు, సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. కల్లెంపల్లి శివారులో కోడి పందేల పేరుతో భారీగా బెట్టింగ్ నిర్వహిస్తున్నారన్న సమాచారంతో పోలీసులు రంగంలోకి దిగారు. రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా ఆదేశాల మేరకు టాస్క్‌ఫోర్స్ ఏసీపీ శ్రీనివాస్ నేతృత్వంలో ఎస్సై రమేష్, నీల్వాయి ఎస్సై నాగరాజు, సిబ్బంది సంయుక్తంగా ఆకస్మిక దాడి చేపట్టారు. పోలీసుల రాకను గమనించినప్పటికీ అక్కడి నుంచి తప్పించుకునే అవకాశం లేకపోవడంతో 16 మంది పట్టుబడ్డారు. పోలీసులు నిర్వహించిన తనిఖీల్లో 4 కోళ్లు, 45 కత్తులు, 18 ద్విచక్ర వాహనాలు, 12 మొబైల్ ఫోన్లు, రూ.24,040 నగదు లభించింది. వీటన్నింటినీ స్వాధీనం చేసుకుని పట్టుబడిన 16 మందిని నీల్వాయి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. కేసు నమోదు చేసి తదుపరి దర్యాప్తు కొనసాగిస్తున్నారు. కోడి పందేలు, జూదం, బెట్టింగ్ వంటి చట్టవిరుద్ధ కార్యకలాపాలను ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించేది లేదని సీపీ అంబర్ కిషోర్ ఝా స్పష్టం చేశారు. ఇలాంటి కార్యకలాపాలకు స్థావరాలు ఏర్పాటు చేసినా, నిర్వహించినా, సహకరించినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. గ్రామీణ ప్రాంతాల్లో కోడి పందేలు, జూదం జరుగుతున్నట్లు సమాచారం ఉంటే పోలీసులకు తెలియజేయాలని ప్రజలకు సూచించారు. కుడిమెత సాయి, జన్నె కమలాకర్, బంద్రకంటి కోటేష్, తేలిగె సాయి, చౌదరి తిరుపతి, ఆత్రం సందీప్, మొగిలి మల్లేష్, మంచాల హనుమంతు, ఎనుముల మధుకర్, మానేపల్లి రాజన్న, మానేపల్లి విలాస్, కీర్తి లక్ష్మణ్, కార్పేట తిరుపతి, దందెర మహేష్, సతిపతి రాజశేఖర్, దోమల మల్లేష్ లను పోలీసులు అరెస్ట్ చేశారు.

## ఆసిఫాబాద్ జిల్లా ప్రాథమిక ఆరోగ్య కేంద్రంను ఆకస్మికంగా తనిఖీ చేసిన అదనపు కలెక్టర్

**ఆసిఫాబాద్, ఆగస్టు 13, ప్రభాతవార్త :**

ఆసిఫాబాద్ మండలంలోని అడ గ్రామంలో జిల్లా అదనపు కలెక్టర్ యువరాజ్ మర్మాట్ గురువారం విస్తృతంగా పర్యటించి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, పాఠశాల, గ్రామ పంచాయతీ కార్యాలయాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆరోగ్య కేంద్రంలో వైద్య సేవలు, మందుల నిల్వలను పరిశీలించి ప్రజలకు నాణ్యమైన వైద్యం అందించాలని సూచించారు. పాఠశాలలో విద్యార్థుల హాజరు, మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి విద్యా ప్రమాణాలు పెంచాలని ఆదేశించారు. గ్రామ పంచాయతీలో పారిశుధ్యం, తాగునీటి సరఫరాపై సమీక్షించి వర్షాకాలంలో దోమల నివారణకు ఫాగింగ్, బ్లీచింగ్ చేపట్టాలని అధికారులను ఆదేశించారు.



## ప్రభుత్వ కళాశాల విద్యార్థులకు నోట్ బుక్స్ పంపిణీ

జన్నారం, ఆగస్టు 13, ప్రభాతవార్త

జన్నారం మండల కేంద్రంలోని ప్రభుత్వ కళాశాల విద్యార్థులకు ప్రభుత్వం అందజేసే నోట్ బుక్స్, బ్యాగ్స్, షూస్‌ను గురువారం ప్రిన్సిపల్ విజిత్ కుమార్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ ప్రభుత్వం ఇచ్చిన నోట్ బుక్స్, బ్యాగ్స్, షూస్‌ను సద్వినియోగం చేసుకొని మంచిగా చదువుకొని తల్లిదండ్రులకు, కళాశాలకు మంచి పేరు ప్రఖ్యాతలు తీసుకురావాలని అన్నారు. ప్రైవేటు కళాశాలలో డబ్బులు పెట్టి చదవాల్సిన అవసరం లేదని, ప్రభుత్వ కళాశాలలో కూడా నాణ్యమైన విద్యతో పాటు తగిన సౌకర్యాలు ప్రభుత్వం కల్పిస్తుందని కావున విద్యార్థులు ప్రభుత్వ కళాశాలలోనే చదువుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యాపక బృందం బాపు రావు, సాయికుమార్, రవీందర్, నాగేశ్వర రావు,మోహన్,శశికళ, దేవేందర్, స్వరూప, కరుణాకర్, కుమారస్వామి, శివరాం, విద్యార్థులు పాల్గొన్నారు.



## బెల్లంపల్లి రోడ్ల విస్తరణకు మార్గం సుగమం

### అధికారులతో ఎమ్మెల్యే గడ్డం వినోద్ వెంకటస్వామి సమీక్ష

బెల్లంపల్లి, ఆగస్టు 13, ప్రభాతవార్త

బెల్లంపల్లి పట్టణ అభివృద్ధిలో భాగంగా చేపట్టనున్న రోడ్ల విస్తరణ పనులను వేగవంతం చేసేందుకు బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ వెంకటస్వామి అధ్యక్షతన గురువారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సంబంధిత శాఖల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు.సమావేశంలో సింగరేణి జనరల్ మేనేజర్ ఎన్. రాధాకృష్ణ, మున్సిపల్ చైర్మన్ దావ స్వాతి రమేష్ బాబు, మున్సిపల్ కమిషనర్ తన్నీరు రమేష్, ఏసీపీ కిరణ్ కుమార్‌తో పాటు సంబంధిత శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, ముఖ్య నాయకులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా బెల్లంపల్లి పట్టణంలో చేపట్టనున్న రోడ్ల విస్తరణ పనులు, సింగరేణి పరిధిలోని విద్యుత్ స్తంభాల మార్పిడి తదితర అంశాలపై ఎమ్మెల్యే అధికారులతో సమీక్షించారు. రోడ్ల విస్తరణకు సంబంధించి వివిధ శాఖల మధ్య సమన్వయం పెంచి, పెండింగ్ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. పట్టణంలో మౌలిక వసతుల అభివృద్ధి పనులను ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ప్రణాళికాబద్ధంగా చేపట్టాలని ఎమ్మెల్యే సూచించారు. అన్ని శాఖల అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేస్తూ అభివృద్ధి పనులకు ఎదురవుతున్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని స్పష్టం చేశారు.బెల్లంపల్లి పట్టణాన్ని మరింత అభివృద్ధి చేసి, ప్రజలకు మెరుగైన రహదారులు, మౌలిక వసతులు కల్పించడమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందని ఎమ్మెల్యే తెలిపారు. సమావేశంలో పట్టణ అభివృద్ధికి సంబంధించిన పలు అంశాలపై అధికారులతో సవివరంగా చర్చించారు.

## ఎమ్మెల్యే గడ్డం వినోద్‌ను కలిసిన మందమర్రి ఏరియా జీఎం

బెల్లంపల్లి, ఆగస్టు 13, ప్రభాతవార్త



బెల్లంపల్లి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మందమర్రి ఏరియా సింగరేణి జనరల్ మేనేజర్ ఎన్. రాధాకృష్ణ ఎమ్మెల్యే గడ్డం వినోద్ వెంకటస్వామిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా జీఎం ఎన్. రాధాకృష్ణ ఎమ్మెల్యేకు పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం బెల్లంపల్లి నియోజకవర్గ పరిధిలో సింగరేణి సంస్థకు సంబంధించిన పలు అంశాలపై ఇరువురు పరస్పరం చర్చించారు. సింగరేణి సంస్థ కార్యకలాపాలు, నియోజకవర్గ అభివృద్ధికి సంబంధించిన అంశాలపై కూడా చర్చించినట్లు తెలిపారు. కార్యక్రమంలో సింగరేణి అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# సింగరేణి సంస్థలో మారుపేర్ల పెండింగ్ సమస్యను తక్షణమే పరిష్కరించాలి

### కొత్తగూడెం హెడ్ ఆఫీస్ ఎదుట రిలే నిరాహార దీక్షకు టిఎన్టియుసి సంపూర్ణ మద్దతు

బెల్లంపల్లి, ఆగస్టు 13, ప్రభాతవార్త



సింగరేణి సంస్థలో మెడికల్ బోర్డుకు దరఖాస్తు చేసుకుని మెడికల్‌గా అన్‌ఫిట్ అయిన ఉద్యోగుల పిల్లలకు సంబంధించిన మారుపేర్ల పెండింగ్ సమస్యతో పాటు విజిలెన్స్ పెండింగ్ కేసులను తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ కొత్తగూడెం సింగరేణి హెడ్ ఆఫీస్ ఎదుట చేపట్టిన రిలే నిరాహార దీక్షకు సింగరేణి కాలరీస్ లెవల్ యూనియన్ టిఎన్టియుసి సంపూర్ణ మద్దతు ప్రకటించింది. బెల్లంపల్లి పట్టణంలోని టిఎన్టియుసి కార్యాలయంలో టిఎన్టియుసి నాయకులు మాట్లాడుతూ సింగరేణి సంస్థలో సుమారు 35 సంవత్సరాల పాటు సేవలందించిన కార్మికులు తమ పిల్లలకు ఉద్యోగాలు లభిస్తాయనే ఆశతో ఎదురుచూస్తూ అలసిపోయారని అన్నారు. డిపెండెంట్ ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్న కార్మికుల పిల్లలు కూడా దాదాపు 12 సంవత్సరాలుగా సమస్య పరిష్కారం కోసం సింగరేణి యాజమాన్యం, గుర్తింపు పొందిన కార్మిక సంఘాల చుట్టూ తిరుగుతున్నారని తెలిపారు. సమస్య పరిష్కారం కోసం గతంలో గెలిచిన గుర్తింపు కార్మిక సంఘాలు, ప్రస్తుతం గుర్తింపు పొందిన సంఘాలు ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవాలని టిఎన్టియుసి నాయకులు డిమాండ్ చేశారు. కార్మికుల పిల్లల ఆశలను నీరుగార్చకుండా సింగరేణి యాజమాన్యం వెంటనే మారుపేర్ల సమస్యకు పరిష్కారం చూపాలని కోరారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, కేంద్ర కార్మిక శాఖ మంత్రి జి. కిషన్‌రెడ్డి, తెలంగాణ రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి తక్షణమే స్పందించి గతంలో ఇచ్చిన హామీలను అమలు చేసి అర్హులైన కార్మికుల పిల్లలకు ఉద్యోగాలు కల్పించాలని టిఎన్టియుసి డిమాండ్ చేసింది. అదేవిధంగా ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్న వారిలో కొందరు ప్రాణాలు కోల్పోయారని, వారి కుటుంబాలకు తక్షణమే రూ.1 కోటి ఎక్స్‌గ్రేషియా అందించాలని, బాధిత కుటుంబాలకు అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పించి న్యాయం చేయాలని నాయకులు కోరారు. కార్మికుల పిల్లలకు ఉద్యోగాలు కల్పించే వరకు, మారుపేర్ల సమస్య పూర్తిగా పరిష్కారమయ్యే వరకు కలిసి వచ్చే అన్ని కార్మిక సంఘాలను కలుపుకొని పోరాటం కొనసాగిస్తామని నాయకులు స్పష్టం చేశారు. కొత్తగూడెం హెడ్ ఆఫీస్ ఎదుట కొనసాగుతున్న రిలే నిరాహార దీక్షకు అండగా నిలిచి, సమస్య పరిష్కారం కోసం నిరంతరం పోరాడుతామని వారు హెచ్చరించారు. ఈ సమావేశంలో టిఎన్టియుసి ఎస్ సి ఎల్ యూనియన్ ప్రధాన కార్యదర్శి టి. మణిరాం సింగ్, ఉపాధ్యక్షులు గద్దెల నారాయణ, జిల్లా నాయకులు ఓ. జీవరత్నం, టిఎన్టియుసి నాయకులు ఆర్. గంగాధర్ గౌడ్, కల్లుగీత కార్మిక సంఘం నాయకులు బుల్లు మల్లయ్య, ఎస్.ఎస్. పాండే, ఏ. కుమార్, ఎం.డి. అజ్గర్ పాషా, కె. వెంకటేశం, పి. యాదగిరి, పుల్లూరి భూషణ్, మాసాడి గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

# సాంకేతిక పరిజ్ఞానంతోనే విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తు

### శ్రీరాంపూర్ పాఠశాలలో నూతన కంప్యూటర్ ల్యాబ్ ప్రారంభించిన మేయర్ ధర్ని మధుకర్



నస్పూర్, ఆగస్టు 13, ప్రభాతవార్త

ప్రస్తుత పోటీ ప్రపంచంలో విద్యార్థులకు కంప్యూటర్ విద్య ఎంతో అవసరమని, చిన్నతనం నుంచే సాంకేతిక పరిజ్ఞానంపై అవగాహన పెంచుకోవడం ద్వారా విద్యార్థులు భవిష్యత్తులో ఉన్నత స్థాయికి ఎదిగే అవకాశం ఉంటుందని మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ ధర్ని మధుకర్ తెలిపారు. శ్రీరాంపూర్ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో నూతనంగా ఏర్పాటు చేసిన కంప్యూటర్ ల్యాబ్‌ను ఆయన శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మేయర్ ధర్ని మధుకర్ మాట్లాడుతూ ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు, ఆధునిక సాంకేతిక సదుపాయాలు కల్పిస్తూ నాణ్యమైన విద్యను అందించేందుకు తెలంగాణ ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. మంచిర్యాల శాసనసభ్యులు కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు ఆధ్వర్యంలో నియోజకవర్గంలోని ప్రభుత్వ పాఠశాలలను ఆధునీకరించడంతో పాటు విద్యార్థులకు అవసరమైన అన్ని సౌకర్యాలను అందుబాటులోకి తీసుకువస్తున్నట్లు వివరించారు. కార్యక్రమంలో భాగంగా మేయర్ చేతుల మీదుగా పాఠశాల ప్రాంగణంలో మొక్కలు నాటగా, విద్యార్థులకు ఉచితంగా షూలు పంపిణీ చేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన మౌలిక వసతులు, నాణ్యమైన విద్య, సాంకేతిక సదుపాయాలు అందుబాటులోకి రావడం వల్ల తల్లిదండ్రుల్లో నమ్మకం పెరుగుతుందని, ఇది విద్యార్థుల సంఖ్య పెరిగేందుకు దోహదపడుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ వేల్పుల రవీందర్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, స్థానిక కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

# ప్రజా చైతన్య యాత్రలో ప్రజా సమస్యలపై సీపీఐ ప్రచారం

బెల్లంపల్లి, ఆగస్టు 13, ప్రభాతవార్త




భారత కమ్యూనిస్టు పార్టీ జాతీయ సమితి పిలుపు మేరకు ఆగస్టు 6 నుంచి 14వ తేదీ వరకు నిర్వహిస్తున్న ప్రజా చైతన్య యాత్రలో భాగంగా బెల్లంపల్లి పట్టణంలో రెండో రోజు శాంతిఖని 65 డిప్, సుభాష్‌నగర్, బాబుక్యాంపు, హనుమాన్‌బస్తీలలో ప్రజా చైతన్య యాత్ర నిర్వహించారు. పట్టణ కార్యదర్శి రాజమౌళి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు కేంద్ర ప్రభుత్వ విధానాలను ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా రాష్ట్ర సమితి సభ్యురాలు బొల్లం పూర్ణిమ, బెల్లంపల్లి నియోజకవర్గ కార్యదర్శి దాగం మల్లేష్ మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను విస్మరించి ప్రజా వ్యతిరేక విధానాలను అమలు చేస్తోందని విమర్శించారు. కార్మికులు ఎన్నో పోరాటాల ద్వారా సాధించుకున్న హక్కులను హరించే విధంగా 44 కార్మిక చట్టాలను నాలుగు లేబర్ కోడ్‌లుగా మార్చి కార్మికులను ఇబ్బందులకు గురిచేస్తోందని ఆరోపించారు. దేశ సంపదను కార్పొరేట్ శక్తులకు అప్పగించే విధానాలను కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తోందని వారు విమర్శించారు. విద్యా వ్యవస్థను నిర్వీర్యం చేస్తూ పరీక్ష పేపర్ల లీకేజీలకు కారణమవుతున్నారని ఆరోపిస్తూ, విద్యార్థుల భవిష్యత్తును కాపాడేందుకు ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. చలో పార్లమెంట్ కార్యక్రమంలో పాల్గొన్న యువతపై జరిగిన చర్యలను వారు ఖండించారు. రైతులకు పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలని, కార్మికులు, రైతులు, విద్యార్థుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ప్రజా సమస్యలపై ప్రజలను చైతన్యపరిచి, రాబోయే రోజుల్లో ప్రజా పోరాటాలను మరింత ఉధృతం చేయాలని పార్టీ కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బీకేఎంయూ జాతీయ సమితి సభ్యులు అక్కపెల్లి బాబు, బెల్లంపల్లి మండల కార్యదర్శి బొంతల లక్ష్మీనారాయణ, తాండూరు మండల కార్యదర్శి కొండు బానేష్, బీకేఎంయూ జిల్లా కార్యదర్శి గుండా చంద్ర మాణిక్యం, జిల్లా సమితి సభ్యులు బొల్లం తిలక్ అంబేద్కర్, రత్నం రాజ్యం, దాసరి తిరుపతిగౌడ్, ఏఐటీఎఫ్ కార్యదర్శి వడ్డేమల్ల రాజేందర్, నాయకులు బండారి శంకర్, కామెర దుర్గయ్య, ఉప్పుల శంకర్, అందుగుల రాజేందర్, స్వామిదాసు, నర్సింగ్ తదితరులు పాల్గొన్నారు.

### విద్యార్థులకు నాణ్యమైన విద్య, పౌష్టికాహారం,

# మెరుగైన వసతులు కల్పించాలి

**- జిల్లా అదనపు కలెక్టర్ పి.చంద్రయ్య**

**బెల్లంపల్లి, ఆగస్టు 13, ప్రభాతవార్త**

ప్రభుత్వ పాఠశాలలు, సంక్షేమ వసతి గృహాల్లో చదువుతున్న విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు మెరుగైన వసతులు, పౌష్టికాహారం, శుద్ధమైన తాగునీరు అందేలా చర్యలు తీసుకోవాలని జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి. చంద్రయ్య అధికారులను ఆదేశించారు. బెల్లంపల్లి పట్టణంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం, యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ కోసం కేటాయించిన స్థలాన్ని ఆయన పరిశీలించారు. పాఠశాలలో తరగతి గదులు, భోజనశాల, వంటశాల, తాగునీటి వసతి, పరిసరాల పరిశుభ్రత తదితర అంశాలను పరిశీలించారు. విద్యార్థుల స్థాయికి అనుగుణంగా సులభంగా అర్థమయ్యే రీతిలో బోధన సాగించాలని, వారిలో చదువుపై ఆసక్తి పెంపొందించేలా బోధనా పద్ధతులను అవలంబించాలని సూచించారు. విద్యార్థుల ఆరోగ్యం, పోషకాహారంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనాన్ని సకాలంలో అందించాలని తెలిపారు. ఆహారం విషయంలో శుభ్రత, నాణ్యత ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలని ఆదేశించారు. వర్షాకాలం నేపథ్యంలో పాఠశాల పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా చర్యలు చేపట్టి, పారిశుద్ధ్యాన్ని పకడ్బందీగా నిర్వహించాలని సూచించారు. యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ నిర్మాణానికి కేటాయించిన స్థలాన్ని పరిశీలించిన అదనపు కలెక్టర్, ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న ఈ పాఠశాల నిర్మాణ పనులను నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయాన్ని సందర్శించిన ఆయన ఓటరు జాబితా సమగ్ర సవరణ ప్రక్రియను వేగవంతం చేసి నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని ఆదేశించారు. స్పష్టమైన ఓటరు జాబితా రూపొందించడంతో పాటు పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీకరణను పకడ్బందీగా చేపట్టాలని సూచించారు. వివిధ ధ్రువపత్రాల కోసం అందిన దరఖాస్తులను నిబంధనల ప్రకారం పరిశీలించి నిర్ణీత సమయంలో జారీ చేయాలని తెలిపారు. మండల పరిషత్ అభివృద్ధి అధికారి కార్యాలయాన్ని సందర్శించి మండలంలో చేపట్టిన అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని సూచించారు. కన్నెపల్లి మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సందర్శించిన పి. చంద్రయ్య విద్యార్థులకు సైకిళ్లు, కుట్టుమిషన్ పంపిణీ చేశారు. పాఠశాల జీవశాస్త్ర ఉపాధ్యాయురాలు మదాసి రమాదేవి, బాల్య మిత్రురాలు ఎం.టి. రాజేశ్వరి సహకారంతో సుమారు రూ.1.80 లక్షల విలువైన సైకిళ్లు, కుట్టుమిషన్ అందించడం అభినందనీయమని అన్నారు. బాలికల విద్యాభ్యాసానికి ఇలాంటి సహకారం అందించడం స్ఫూర్తిదాయకమని పేర్కొంటూ, విద్యార్థులు ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకొని ఉన్నత లక్ష్యాలను సాధించాలని ఆకాంక్షించారు. కన్నెపల్లి కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని కూడా ఆయన సందర్శించి విద్యార్థులకు అందుతున్న సౌకర్యాలు, మధ్యాహ్న భోజనం నాణ్యత, పారిశుద్ధ్య నిర్వహణను పరిశీలించారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు మెనూ ప్రకారం పౌష్టికాహారం అందిస్తూ వారి ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని అధికారులకు సూచించారు. తహసీల్దార్, ఎంపీడీఓ కార్యాలయాలను సందర్శించి ఓటరు జాబితా సవరణ ప్రక్రియపై అధికారులకు పలు సూచనలు చేశారు. నెన్నెల మండలం నందులపల్లి గ్రామపంచాయతీని సందర్శించిన అదనపు కలెక్టర్ గ్రామంలోని పారిశుద్ధ్య నిర్వహణను, ఇటీవల కురిసిన వర్షాలతో ఏర్పడిన పరిస్థితులను పరిశీలించారు. గ్రామపంచాయతీ సమగ్ర అభివృద్ధి ప్రణాళిక, గ్రామసభ అంశాలపై వివరాలు తెలుసుకున్నారు. గ్రామాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దేందుకు పారిశుద్ధంపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ఈ కార్యక్రమాల్లో డివిజనల్ పంచాయతీ అధికారి సతీష్, మండల పంచాయతీ అధికారి శ్రీనివాస్, జిల్లా డి.సి.ఈ.బి. కార్యదర్శి పి. మహేశ్వరరెడ్డి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీరాములు, సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.





## పెండింగ్ సమస్యల పరిష్కారానికై దశలవారీగా పోరాటం

**జన్నారం, ఆగస్టు 13, ప్రభాతవార్త**

ఉద్యోగ, ఉపాధ్యాయ పెన్షనర్లు ఎదుర్కొంటున్న దీర్ఘకాలిక సమస్యల పరిష్కారం కోసం యూ.ఎస్.పి.సి రాష్ట్ర స్టీరింగ్ కమిటీ పిలుపు మేరకు దశలవారీ పోరాటంలో భాగంగా గురువారం స్థానిక తహశీల్దార్ ద్వారా రాష్ట్ర ముఖ్యమంత్రి చేరవేయాలని ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ ఆధ్వర్యంలో వినతి పత్రం అందచేశారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ రాష్ట్ర స్టీరింగ్ కమిటీ సభ్యులు జాడి రాజన్న మాట్లాడుతూ ప్రభుత్వం వెంటనే ఉద్యోగ, ఉపాధ్యాయ,విద్యారంగ సమస్యలపై సానుకూలంగా స్పందించి తక్షణ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా ఉద్యోగ, ఉపాధ్యాయులకు రావలసిన జీతభత్యాలు, జీపీఎఫ్,మెడికల్ బిల్లులు మరియు ఇతర అన్ని రకాల పెండింగ్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని,పెండింగ్ ఉన్న ఐదు కరువు భత్యాలను తక్షణమే మంజూరు చేయాలని డిమాండ్ చేశారు.ఉద్యోగ, ఉపాధ్యాయులకు తీవ్ర నష్టం కలగకుండా,అత్యంత మెరుగైన ఫిట్‌మెంట్‌తో కూడిన నూతన పీఆర్సీని వెంటనే ప్రకటించి అమలు చేయాలని, పాఠశాలల్లో విద్యా ప్రమాణాల మెరుగుదలకు, మౌలిక వసతుల కల్పనకు తగిన నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. ఉపాధ్యాయులకు బోధనేతర పనుల భారాన్ని పూర్తిగా తగ్గించి, కేవలం బోధనపై మాత్రమే దృష్టి పెట్టేలా చర్యలు తీసుకోవాలి. ఉపాధ్యాయ బదిలీలు, పదోన్నతుల ప్రక్రియను ఎలాంటి జాప్యం లేకుండా పారదర్శకంగా పూర్తి చేయాలని, పెండింగ్‌లో ఉన్న పదోన్నతులు, హెచ్‌ఎం, స్కూల్ అసిస్టెంట్ పోస్టుల భర్తీని వెంటనే చేపట్టాలని, కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ ను రద్దు చేసి, పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి ఉద్యోగ, ఉపాధ్యాయుల మరియు విద్యా రంగానికి చెందిన పై సమస్యలన్నింటినీ వెంటనే పరిష్కరించాలని, లేనియెడల రాబోయే రోజుల్లో ప్రజాస్వామ్య పద్ధతిలో హైదరాబాద్ ఇందిరా పార్క్ లో ఆగస్టు 29న మహాధర్నా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు రవీందర్,యూటీఎఫ్ మండల అధ్యక్షుడు సత్పది నర్సయ్య, తుంగూరి గోపాల్, రాథోడ్ సురేష్, పాండు రంగ్ తదితరులు పాల్గొన్నారు

## ప్రతి ఇంట జాతీయ జెండా పండుగ జరగాలి

**- భాజపా జిల్లా అధ్యక్షులు నగునూరి వెంకటేశ్వర్ గౌడ్**

**చెన్నూరు, ఆగస్టు 13, ప్రభాతవార్త**

స్వాతంత్ర దినోత్సవ వేడుకల్లో భాగంగా ప్రతి ఇంట జాతీయ జెండా ఆవిష్కరణ కార్యక్రమం పండగలా జరగాలని భారతీయ జనతా పార్టీ మంచిర్యాల జిల్లా అధ్యక్షులు నంగునూరు వెంకటేశ్వర్ గౌడ్ అన్నారు. మంచిర్యాల జిల్లా చెన్నూరు పట్టణంలో నిర్వహించిన తిరంగా ర్యాలీని జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం హనుమాన్ దేవాలయం నుంచి గాంధీ చౌక్, రాజీవ్ రోడ్ మీదుగా అంబేద్కర్ చౌక్ వరకు భారీగా తిరంగా ర్యాలీ నిర్వహించి అనంతరం సామూహిక వందేమాతర గీతం ఆలపించారు. ఈ సందర్భంగా బీజేపీ జిల్లా అధ్యక్షులు నగునూరు వెంకటేశ్వర్ గౌడ్ మాట్లాడుతూ 60 సంవత్సరాలు పరిపాలన చేసిన కాంగ్రెస్ పార్టీ దేశ ప్రజలను జాతీయ జెండాకు దూరం చేసిందని, నరేంద్ర మోడీ ప్రధానిగా ఎన్నికైన తర్వాత జాతీయ జెండాను ప్రతి ఇంటికి చేర్చి రెపరెపలాడే విధంగా ప్రతి ఇంటికీ అందించాడని అన్నారు. ప్రధాని పిలుపు మేరకు దేశవ్యాప్తంగా పెద్ద ఎత్తున తిరంగా యాత్ర కార్యక్రమాలు ప్రజలు నిర్వహించి స్వచ్ఛంగా భాగస్వాములు అవుతున్నారని, దేశంలో జాతీయ భావం పెరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో భాజపా, విశ్వహిందూ పరిషత్, ఆర్.ఎస్.ఎస్ నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.



## మందమర్రి ఏరియాలో 12 మంది ఉత్తమ ఉద్యోగులకు ఘన సన్మానం

**మందమర్రి, ఆగస్టు 13, ప్రభాతవార్త**

80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను పురస్కరించుకుని మందమర్రి ఏరియా జనరల్ మేనేజర్ కార్యాలయంలో ఆగస్టు 15న ఘనంగా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు సింగరేణి యాజమాన్యం వెల్లడించింది. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా మందమర్రి ఏరియా జనరల్ మేనేజర్ ఎన్. రాధాకృష్ణ ముఖ్యఅతిథిగా హాజరై ఉదయం జాతీయ జెండాను ఆవిష్కరించనున్నారు. అనంతరం మందమర్రి ఏరియా నుంచి ఎంపికైన 12 మంది ఉత్తమ ఉద్యోగులను ఘనంగా సన్మానించనున్నారు. ఎంపికైన 12 మందిలో ఒక ఉద్యోగిని ఉత్తమ సింగరేనియన్‌గా ఎంపిక చేయగా, కొత్తగూడెం లోని ప్రకాశం స్టేడియంలో నిర్వహించనున్న స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో సంస్థ సీఎండీ బుద్ధ ప్రకాశ్ జ్యోతి చేతుల మీదుగా ఘనంగా సన్మానించి బహుమతి అందజేయనున్నట్లు అధికారులు తెలిపారు. మిగిలిన 11 మంది ఉత్తమ ఉద్యోగులను మందమర్రి ఏరియా జనరల్ మేనేజర్ కార్యాలయంలో జీఎం ఎన్. రాధాకృష్ణ చేతుల మీదుగా సన్మానించనున్నారు. ఈ సందర్భంగా సాంస్కృతిక కార్యక్రమాలు కూడా నిర్వహించనున్నట్లు డీజీఎం (పర్సనల్) సి.హెచ్. అశోక్ తెలిపారు. ఉద్యోగుల సేవలను గుర్తించి ప్రోత్సహించడంలో భాగంగా ప్రతి ఏడాది స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఉత్తమ ఉద్యోగులను ఎంపిక చేసి సన్మానిస్తున్నామని అధికారులు పేర్కొన్నారు.



## సైబర్ నేరాల పట్ల విద్యార్థినులు అప్రమత్తంగా ఉండాలి

**- అవగాహన సదస్సులో డీసీపీ భాస్కర్**

**చెన్నూరు, ఆగస్టు 13, ప్రభాతవార్త**

సైబర్ నేరగాళ్ల నుంచి తమను తాము రక్షించుకునే విధంగా జాగ్రత్త పడాలని మంచిర్యాల డీసీపీ ఏ.భాస్కర్ విద్యార్థినులకు సూచించారు. మంచిర్యాల జిల్లా చెన్నూరు పట్టణ పోలీసుల ఆధ్వర్యంలో సోషల్ వెల్ఫేర్ గురుకుల పాఠశాలలో ఏర్పాటు చేసిన సురక్ష తిరంగా కార్యక్రమంలో భాగంగా పాఠశాల విద్యార్థినులకు సైబర్ నేరాల పట్ల అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మంచిర్యాల డీసీపీ, జైపూర్ ఏసీపీ, రామగుండం పోలీస్ సైబర్ వారియర్స్ టీం ఇంచార్జ్ ఇన్స్పెక్టర్ శ్రీనివాస్, సైబర్ నేరాల పట్ల విద్యార్థినులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డీసీపీ భాస్కర్ మాట్లాడుతూ శత్రువుల నుంచి దేశాన్ని కాపాడే బాధ్యత ఆర్మీ వాళ్ళదైతే అంతర్గతంగా రక్షించే బాధ్యత పోలీస్ వారిదని అన్నారు. వ్యక్తిగతంగా తమను తాము సైబర్ నేరస్థుల భారీ నుండి రక్షించుకునే బాధ్యత మాత్రం ప్రజలదేనన్నారు. అంతర్జాతీయంగా సైబర్ నేరాలు తీవ్రంగా పెరుతున్నందున ప్రజలు సైబర్ నేరస్థుల భారిన పడి తమ విలువైన డబ్బులు పోగొట్టుకోకుండా అప్రమత్తత చాలా అవసరమన్నారు. సైబర్ నేరగాళ్ళు ఎన్నో విధాలుగా ప్రజలను మోసం చేసి, భయభ్రాంతులకు గురిచేసి, సైబర్ నేరాలకు పాల్పడుతున్నారని, అందువలన నేరాలు తీవ్రంగా పెరగడమే గాక దేశ ఆర్థిక వ్యవస్థ పై తీవ్ర ప్రభావం పడుతుందన్నారు దీనికి పరిష్కార మార్గం స్వీయ రక్షణ మాత్రమేనని తెలిపారు. ప్రజలు అత్యాశకు వెళ్లి సైబర్ నేరగాళ్ల ఉచ్చులో పడి తమ విలువైన డబ్బు పోగొట్టుకోవడమే గాక, మనః శాంతిని కోల్పోతున్నారని తెలిపారు. విద్యార్థులు మొబైల్ ఫోన్స్‌ను తమ అవసర నిమిత్తం మాత్రమే ఉపయోగించాలని, అనవసరమైన యాప్‌లు, వీడియో గేమ్‌లు, ఇంస్టాగ్రామ్ లాంటి వాటిని ఉపయోగించడం వల్ల సైబర్ నేరగాళ్ళు వాటి మాటున దాగి అమ్మాయిలను బెదిరించి మోసాలకు పాల్పడుతున్నారని అన్నారు. మన మొబైల్ ఫోన్స్ ఆధార్ కార్డుతో అనుసంధానమై ఉంటుందని, బ్యాంకు ఖాతా కు సంబంధించిన అన్నీ ట్రాన్సక్షన్స్ ఫోన్‌తోనే లింక్ అయ్యి ఉన్నందున సైబర్ నేరగాళ్ళు మొబైల్ ఫోన్స్ పంపే సందేశాలు, కాల్స్, లింక్స్ ఆధారంగా నేరాలకు పాల్పడుతున్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జైపూర్ ఏసీపీ వెంకటేశ్వర్, చెన్నూర్ పట్టణ సీఐ బన్సీలాల్, ఎస్ఐలు శ్యాం పటేల్, రాజశేఖర్, సిబ్బంది పాల్గొన్నారు.



## కన్నెపల్లిలో రూ.2.25 కోట్లతో నూతన తహసీల్దార్ కార్యాలయం

బెల్లంపల్లి, ఆగస్టు 13, ప్రభాతవార్త

బెల్లంపల్లి నియోజకవర్గంలోని కన్నెపల్లి మండల కేంద్రంలో రూ.2.25 కోట్ల అంచనా వ్యయంతో నిర్మించనున్న నూతన తహసీల్దార్ కార్యాలయ భవనానికి సంబంధించిన స్థలాన్ని ఎమ్మెల్యే గడ్డం వినోద్ వెంకటస్వామి పరిశీలించారు. సబ్ కలెక్టర్ మనోజ్, తహసీల్దార్ రామచందర్, మాజీ ఎంపీపీ సృజన నర్సింగరావు, ఏసీపీ కిరణ్ కుమార్ తదితర అధికారులతో కలిసి ప్రతిపాదిత స్థలాన్ని ఎమ్మెల్యే పరిశీలించారు. కార్యాలయ భవన నిర్మాణానికి అనువైన స్థలం, మౌలిక వసతులు, ఇతర అవసరాలపై అధికారులతో చర్చించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మండల ప్రజలకు మెరుగైన రెవెన్యూ సేవలు అందించేందుకు ఆధునిక వసతులతో కూడిన నూతన తహసీల్దార్ కార్యాలయ భవనాన్ని నిర్మించనున్నట్లు తెలిపారు. భవన నిర్మాణానికి సంబంధించిన పనులను త్వరితగతిన ప్రారంభించి ముందుకు తీసుకెళ్లాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, మాజీ ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.




## బెల్లంపల్లిలో క్షయ వ్యాధిగ్రస్తులకు ఉచిత పౌష్టికాహార కిట్ల పంపిణీ

బెల్లంపల్లి, ఆగస్టు 13, ప్రభాతవార్త

బెల్లంపల్లి ఏరియా ఆసుపత్రిలో గురువారం క్షయ వ్యాధిగ్రస్తులకు ఉచిత పౌష్టికాహార కిట్లను పంపిణీ చేశారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ నరేందర్ రాథోడ్ ఆధ్వర్యంలో లైన్స్ క్లబ్ బెల్లంపల్లి సహకారంతో 15 మంది క్షయ వ్యాధిగ్రస్తులకు పౌష్టికాహార కిట్లను అందజేశారు. ఈ సందర్భంగా డీఎంహెచ్ఓ డాక్టర్ నరేందర్ రాథోడ్ మాట్లాడుతూ జిల్లాలోని క్షయ వ్యాధిగ్రస్తులకు ఎన్జీవోలు, దాతల సహకారంతో పౌష్టికాహార కిట్లను అందిస్తున్నామని తెలిపారు. క్షయ వ్యాధిగ్రస్తులను సంపూర్ణ ఆరోగ్యవంతులుగా తీర్చిదిద్దేందుకు దాతలు, స్వచ్ఛంద సంస్థలు ముందుకు వచ్చి తమ వంతు సహకారం అందించాలని కోరారు. పౌష్టికాహారం తీసుకోవడం ద్వారా చికిత్సకు మంచి ఫలితాలు సాధించవచ్చని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉప జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ సుధాకర్ నాయక్, బెల్లంపల్లి ఏరియా ఆసుపత్రి వైద్యులు డాక్టర్ రవి, లైన్స్ క్లబ్ బెల్లంపల్లి అధ్యక్షులు, సభ్యులు, వైద్యులు, వైద్య సిబ్బంది, సీహెచ్ఓలు పుట్ట సత్తయ్య, నాందేవ్, కాకిరాల వెంకటేశ్వర్లు, శ్రీనివాస్, క్షయ వ్యాధి నియంత్రణ బెల్లంపల్లి కోఆర్డినేటర్ శశికాంత్, మధు, ఆప్తాల్మిక్ ఆఫీసర్ శ్రీ శంకర్, మురళి యాదవ్, జిల్లా మాస్ మీడియా అధికారి బుక్క వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా క్షయ వ్యాధి నివారణ, చికిత్స, పౌష్టికాహారం ప్రాధాన్యతపై వ్యాధిగ్రస్తులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు.

# ప్రభుత్వ విద్యాసంస్థను బలోపేతం చేస్తున్నాం

### - రాష్ట్ర విద్యాశాఖ కార్యదర్శి యోగితారాణా

నస్పూర్, ఆగస్టు 13, ప్రభాతవార్త

ప్రభుత్వ విద్యా సంస్థలను బలోపేతం చేస్తూ విద్యార్థులకు సకల సదుపాయాలతో కూడిన నాణ్యమైన విద్య అందించడం జరుగుతుందని రాష్ట్ర విద్యాశాఖ కార్యదర్శి యోగితారాణా అన్నారు. గురువారం హైదరాబాద్ లోని ఉస్మానియా విశ్వవిద్యాలయ ప్రాంగణంలోని ఠాగూర్ ఆడిటోరియంలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి జిల్లా విద్యాధికారులు, మండల విద్యాధికారుల ఒక్కరోజు శిక్షణ కార్యక్రమానికి పాఠశాల విద్యాశాఖ సంచాలకులు నవీన్ నికోలస్, ఎస్‌సిఆర్‌టి సంచాలకులు జి.రమేష్, ఎఎస్‌పిడి శ్రీహరిలతో పాటు విద్యార్థుల నమోదులో రాష్ట్రంలో మొదటి స్థానంలో నిలిచిన మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ ప్రత్యేక ఆహ్వానితులుగా




హాజరయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్ర విద్యాశాఖ కార్యదర్శి మాట్లాడుతూ రాష్ట్రంలోని ప్రతి ప్రభుత్వ పాఠశాల గత విద్యా సంవత్సరం కంటే 10 శాతం విద్యార్థులను నమోదు చేయాలని లక్ష్యంగా నిర్ణయించడం జరిగిందని, మంచిర్యాల జిల్లా 96.16 శాతంతో మొదటి స్థానంలో నిలిచిందని తెలిపారు. సమాజం దిశను మార్చే ప్రభావవంతమైన విద్యావ్యవస్థకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వడం జరుగుతుందని, తద్వారా క్షేత్రస్థాయి ఉపాధ్యాయుడు నుండి జిల్లా విద్యాధికారి వరకు అందరి సమన్వయంతో ప్రణాళికబద్ధంగా విద్య వ్యవస్థను పటిష్టం చేయడం జరుగుతుందని తెలిపారు.

జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ మాట్లాడుతూ మంచిర్యాల జిల్లాలో విద్యా వ్యవస్థ అభివృద్ధిలో అవలంబించిన విధానాలు, చేపట్టిన కార్యక్రమాలు, పాటించిన ప్రత్యేక వ్యూహాలు, నిర్వహించిన వినూత్న కార్యక్రమాలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. జిల్లాలోని ప్రజాప్రతినిధులతో విద్యా శాఖలో నిర్వహిస్తున్న కార్యక్రమాలపై ఒక రోజు అవగాహన కార్యక్రమం నిర్వహించడంతో ప్రభుత్వ విద్యా వ్యవస్థ పై విద్యార్థుల తల్లిదండ్రులలో నమ్మకం కలిగి మంచిర్యాల జిల్లాలో 4 వేల 9 మంది ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలలలో చేరారని తెలిపారు. ప్రీ ప్రైమరీ పాఠశాలలు ప్రారంభించడం, కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాలు, ఆదర్శ పాఠశాలల బాలికల వసతి గృహాలలో మెరుగైన మౌలిక వసతుల కల్పనతో విద్యార్థుల చేరికలు అధికంగా జరిగాయని తెలిపారు. అంగన్వాడీ సిబ్బందితో సమన్వయం చేసుకోవడం వలన ప్రాథమిక పాఠశాలలు, ప్రీ ప్రైమరీ పాఠశాలలలో నమోదు పెరగడం, ప్రైవేట్ పాఠశాలల నుండి ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులు చేరిన సందర్భంలో యు-డైస్‌లో విద్యార్థుల రికార్డు బదిలీ కొరకు చేపట్టిన ప్రత్యేక కార్యాచరణ, పాఠశాల, స్కూల్ కాంప్లెక్స్, మండలాల వారీగా లక్ష్యాన్ని, బాధ్యతలను కేటాయించి పర్యవేక్షించడంతో పాటు లోపాలను సరిదిద్దడం జరిగిందని తెలిపారు. ప్రాథమిక పాఠశాలలలో 5వ తరగతిలో ఉన్న విద్యార్థులను సమీప ఉన్నత పాఠశాలలను సందర్శించి అందుతున్న సౌకర్యాలు తెలుసుకునేలా ఏర్పాట్లు చేయడం జరిగిందని, ప్రతి ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు తన పాఠశాలలో 5వ తరగతి పూర్తి చేసిన విద్యార్థులను స్వయంగా దగ్గరుండి సమీప ప్రాథమికోన్నత/ఉన్నత పాఠశాలలో చేర్పించేలా చర్యలు తీసుకున్నామని, ప్రాథమికోన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు తన పాఠశాలలో 7వ/8వ తరగతి పూర్తి చేసిన విద్యార్థులను ఉన్నత పాఠశాలలలో చేర్పించేలా ఆదేశాలు ఇవ్వడం జరిగిందని తెలిపారు. 2025-26లో అత్యధిక విద్యార్థుల నమోదు చేసిన పాఠశాలల ప్రధానోపాధ్యాయులచే ఉపాధ్యాయుల శిక్షణ కార్యక్రమంలో చర్చించడం, ప్రభుత్వ పాఠశాలలలో అమలవుతున్న కార్యక్రమాలు, అందుతున్న సౌకర్యాల పట్ల తల్లిదండ్రుల సమావేశంలో అవగాహన కల్పించడం వంటి చర్యల ద్వారా అత్యధిక విద్యార్థుల నమోదు సాధ్యమైందని వివరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్రంలోని 33 జిల్లాల జిల్లా విద్యాధికారులు, 630 మంది మండల విద్యాధికారులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## బాధితుల ఫిర్యాదులపై తక్షణమే చట్టపరమైన చర్యలు తీసుకోవాలి

### - మంచిర్యాల డీసీపీ ఎ. భాస్కర్

నస్పూర్, ఆగస్టు 13, ప్రభాతవార్త



పోలీస్ స్టేషన్‌కు వచ్చే బాధితుల నుంచి ఫిర్యాదులు స్వీకరించిన వెంటనే చట్టపరిధిలో విచారణ జరిపి, తగిన చర్యలు తీసుకోవాలని మంచిర్యాల డీసీపీ ఎ. భాస్కర్ అధికారులను ఆదేశించారు. సీసీసీ నస్పూర్ పోలీస్ స్టేషన్‌ను ఆయన గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పోలీస్ స్టేషన్‌కు చేరుకున్న డీసీపీ ముందుగా రిసెప్షన్‌ను సందర్శించి, అక్కడ ఉన్న బాధితులతో నేరుగా మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం స్వీకరణ కేంద్రంలోని రికార్డులను పరిశీలించి, వాటి నిర్వహణ తీరును సమీక్షించారు. పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న అధికారులు, సిబ్బంది వివరాలు, వారికి కేటాయించిన బాధ్యతలు, చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడే వ్యక్తులపై సేకరిస్తున్న సమాచారాన్ని సీఐ రవీందర్, ఎస్ఐలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా స్టేషన్ సిబ్బందితో మాట్లాడి, వారి శాఖాపరమైన సమస్యల గురించి విచారించారు. శాంతిభద్రతల పరిరక్షణతో పాటు ప్రజలకు మెరుగైన సేవలు అందించేలా సిబ్బంది మరింత బాధ్యతాయుతంగా, అంకితభావంతో విధులు నిర్వహించాలని డీసీపీ సూచించారు. స్టేషన్ పరిధిలో చట్టవ్యతిరేక పనులకు తావులేకుండా నిరంతర నిఘా ఉంచాలని అధికారులకు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## నీట్-2027 లాంగ్ టర్మ్ శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

### - జోనల్ ఆఫీసర్ ఏ. శారద

లక్షెట్టిపేట, ఆగస్టు 13, ప్రభాతవార్త



తెలంగాణ రాష్ట్ర సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ ఆధ్వర్యంలో 2026-27 విద్యా సంవత్సరానికి గాను నీట్-2027 లాంగ్ టర్మ్ శిక్షణ నిర్వహించనున్నట్లు, తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ, కాళేశ్వరం జోన్, జోనల్ ఆఫీసర్ ఏ.శారద తెలిపారు. ప్రవేశ పరీక్షకు సిద్ధమయ్యే ప్రతిభావంతులైన విద్యార్థులకు ఉచితంగా లాంగ్ టర్మ్ కోచింగ్ అందించేందుకు హైదరాబాద్‌లోని సోషల్ వెల్ఫేర్ కు చెందిన ఫౌండేషన్ సిఓఈలో బాలురకు, మహేంద్ర హిల్స్ ఫౌండేషన్ సిఓఈలో బాలికలకు శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. ఈ శిక్షణకు, బాలురు 100 మంది, బాలికలు, 100 మంది చొప్పున మొత్తం 200 సీట్లు అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. 2025-26 విద్యా సంవత్సరంలో ఇంటర్మీడియట్ బైపిసి చదివి ఉత్తీర్ణులైన, నీట్-2026 ప్రవేశ పరీక్షకు హాజరైన విద్యార్థులు ఈ లాంగ్ టర్మ్ శిక్షణకు అర్హులని తెలిపారు. అర్హత కలిగిన విద్యార్థులు సంబంధిత వెబ్‌సైట్‌ను సందర్శించి, నోటిఫికేషన్‌లో పేర్కొన్న వివరాలను పరిశీలించి, దరఖాస్తు ప్రక్రియను పూర్తి చేయాలని సూచించారు. పై వెబ్ సైట్ నందు గల దరఖాస్తును నింపి, అన్ని ధ్రువపత్రాలను జత పరిచి, తదుపరి అట్టి దరఖాస్తును సంబంధిత డిస్ట్రిక్ట్ కోఆర్డినేటర్‌కు నిర్దేశిత గడువులోగా సమర్పించవలెను. దరఖాస్తు చేయుటకు ఎటువంటి ఫీజు లేదని,దరఖాస్తుల స్వీకరణకు చివరి తేదీ: 22-08-2026, కావున అర్హత కలిగిన విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని, మెరుగైన ఫలితాలు సాధించేందుకు కృషి చేయాలని, జోనల్ ఆఫీసర్ కోరారు.

## రాత్రి సమయంలో ఇసుక అక్రమ రవాణా

### రెండు ట్రాక్టర్లను సీజ్ చేసిన పోలీసులు

చెన్నూరు, ఆగస్టు 13, ప్రభాతవార్త



అర్ధరాత్రి దొంగచాటుగా అక్రమంగా గోదావరి నుండి ఇసుక తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను సీజ్ చేసినట్లు చెన్నూరు పట్టణ సీఐ బన్సీలాల్ తెలిపారు. మంచిర్యాల జిల్లా చెన్నూరు మండలం రాయపేట వద్ద అక్రమంగా ఇసుకను తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను పట్టుకొని పోలీస్ స్టేషన్ కు తరలించి, ఇద్దరు ట్రాక్టర్ డ్రైవర్స్, ఓనర్స్ పై కేసు నమోదు చేసి ట్రాక్టర్లను సీజ్ చేశామని పట్టణ సీఐ బన్సీలాల్, ఎస్ఐ శ్యాం పటేల్ తెలిపారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ ఎవరైనా ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుక తరలిస్తే వారిపై కఠిన చర్యలు తీసుకోబడటమే గాక, ట్రాక్టర్ ఎంవి యాక్ట్ ప్రకారం డ్రైవర్ లైసెన్స్ రద్దు చేయించడం, ట్రాక్టర్లను మైనింగ్ డిపార్ట్మెంట్ వారికి అప్పగించడం జరుగుతుందని తెలిపారు.

## నేడు ఫీల్డ్ అసిస్టెంట్ల డివిజన్ సమావేశం

**భైంసా, ఆగస్టు 13, ప్రభాతవార్త:**



పరిధిలోని వీబీఆర్జీ రామ్‌జీ (మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ) పథకంలో పనిచేస్తున్న గ్రామ పంచాయతీ ఫీల్డ్ అసిస్టెంట్ల (రోజ్‌గార్ సేవక్) డివిజన్ స్థాయి యూనియన్ సమావేశం ఈ నెల 14న నిర్వహిస్తున్నట్లు భైంసా ఐఎన్టీయూసీ ప్రధాన కార్యదర్శి సూర్యవంశి రాములు తెలిపారు. మధ్యాహ్నం 12:30 గంటలకు స్థానిక మండల అభివృద్ధి కార్యాలయంలో ఈ సమావేశం జరుగుతుందని ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సమావేశంలో ఫీల్డ్ అసిస్టెంట్లకు ఎన్టీఈ పేస్కేల్ అమలు, బదిలీల ప్రక్రియ, యూనియన్ సభ్యత్వ నమోదు, హెల్త్ కార్డులు, ఇన్సూరెన్స్ సదుపాయాలు, వేతన పెంపుతో పాటు ఉద్యోగులు ఎదుర్కొంటున్న వివిధ సమస్యలపై సుదీర్ఘంగా చర్చించనున్నట్లు తెలిపారు. బాసర, భైంసా, ముధోల్, లోకేశ్వరం, తానూర్, కుబీర్, కుంటాల మండలాలకు చెందిన ఫీల్డ్ అసిస్టెంట్లు పెద్ద సంఖ్యలో హాజరై సమావేశాన్ని విజయవంతం చేయాలని సూర్యవంశి రాములు కోరారు.



## భైంసాలో ఘనంగా హర్ ఘర్ తిరంగా ర్యాలీ

**భైంసా, ఆగస్టు 13, ప్రభాతవార్త:**

భైంసాలో నిర్వహించిన హర్ ఘర్ తిరంగా ర్యాలీలో ముధోల్ ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ పాల్గొన్నారు. జాతీయ జెండాను చేతబూని ర్యాలీలో పాల్గొన్న ఆయన దేశభక్తిని, జాతీయ సమైక్యతను చాటిచెప్పారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రతి ఇంటిపై జాతీయ జెండాను ఎగురవేసి దేశభక్తిని చాటాలని పిలుపునిచ్చారు. స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను స్మరించుకోవడంతో పాటు జాతీయ జెండా ఔన్నత్యాన్ని కాపాడటం ప్రతి ఒక్కరి బాధ్యత అన్నారు. యువత పెద్ద సంఖ్యలో ఈ కార్యక్రమంలో భాగస్వాములు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, విద్యార్థులు, నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. జాతీయ జెండాలతో సాగిన ర్యాలీ దేశభక్తి నినాదాలతో ఉత్సాహంగా సాగింది.

## కౌలు రైతుల పరిస్థితులపై జిల్లా స్థాయి సమావేశం

**సారంగాపూర్, ఆగస్టు 13, ప్రభాతవార్త:**

కౌలు రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై నిర్మల్ జిల్లా కిసాన్ సెల్ అధ్యక్షుడు అట్ల పోతారెడ్డి గురువారం జిల్లా స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా కౌలు రైతుల సాధన కమిటీ, రైతు స్వరాజ్య వేదిక సభ్యులు హాజరయ్యారు. ఈ సందర్భంగా అట్ల పోతారెడ్డి మాట్లాడుతూ.. కౌలు రైతులు భూములను కౌలుకు తీసుకుని సాగు చేస్తున్నారని, విత్తనాలు, ఎరువులు కొనుగోలు చేయడం వారికి భారంగా మారుతోందన్నారు. కౌలు రైతులుగా గుర్తించి వారికి ప్రత్యేకంగా గుర్తింపు కార్డులు అందజేయాలని కోరారు. గుర్తింపు కార్డులతో పాటు ఎరువుల సరఫరా, పంట సాగుకు రుణాలు అందించేలా చూడాలన్నారు. పండిన ధాన్యాన్ని విక్రయించుకోవడానికి రైతులు పడుతున్న ఇబ్బందులను తొలగించాలని డిమాండ్ చేశారు. అనంతరం ఈ సమస్యలపై ఆర్డీవోకు వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో నిర్మల్ మార్కెట్ కమిటీ ఛైర్మన్ భీమారెడ్డి, రవి, ఎస్ఎన్ రెడ్డి, పరికిపండ్ల స్వదేశ్, కౌలు రైతులు పాల్గొన్నారు.



# నాన్ ఏజెన్సీ గ్రామాలను ఏజెన్సీలో కలపాలి

**- ఆదివాసీల చట్టాలను హరిస్తున్న కేంద్ర బీజేపీ, రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వాలు**

**- దసలీ రైతులపై అటవీ శాఖ అధికారుల దౌర్జన్యం అరికట్టాలి**

**- తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర కార్యదర్శి పూసం సచిన్**

**చెన్నూరు, ఆగస్టు 13, ప్రభాతవార్త**




ఆదివాసీ గిరిజనులపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న విధానాలు తమ హక్కులను కాలరాసే విధంగా ఉన్నాయని తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర కార్యదర్శి పూసం సచిన్ మండిపడ్డారు. మంచిర్యాల జిల్లా చెన్నూరు పట్టణంలో గురువారం రోజు తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం ఆధ్వర్యంలో పట్టణంలో ప్రపంచ ఆదివాసీ దినోత్సవ ముగింపు వేడుకలు ఘనంగా జరిగాయి. ఆదివాసీల సాంస్కృతిక ప్రదర్శనలు, భారీ ర్యాలీల ద్వారా వారి ఐక్యతను సమాజానికి చాటి చెప్పారు. ముఖ్య అతిథులుగా తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర కార్యదర్శి పూసం సచిన్ హాజరై మాట్లాడుతూ ప్రపంచవ్యాప్తంగా ఆదివాసుల హక్కుల పరిరక్షణ, అభివృద్ధి కోసం 1994లో ఐక్యరాజ్యసమితి ఈ దినోత్సవాన్ని ప్రకటించిందని అన్నారు. దేశంలో జార్ఖండ్, ఒడిశా, ఛత్తీస్‌ఘడ్ మణిపూర్‌లో మైనింగ్, కనిజ వనరులను కార్పొరేట్ కంపెనీలకు అప్పజెప్తూ ఆదివాసులపై తీవ్రమైన దాడులు చేపిస్తున్నారని మండిపడ్డారు. వారిని అడవుల నుంచి తరిమేస్తూ భూములు లాక్కుంటున్నారని ఆరోపించారు. నరేంద్ర మోడీ, కాంగ్రెస్ ప్రభుత్వాలు అడవులను ప్రైవేటీకరిస్తూ, ఆదివాసులను అడవులకు దూరం చేసేలా వ్యవహరిస్తున్నాయని విమర్శించారు. సాగు చేసుకుంటున్న పోడు భూములకు పట్టాలు ఇవ్వకుండా, ఫారెస్ట్ అధికారులను పంపి దాడులు చేయించడం దారుణమని పేర్కొన్నారు. సాగులో ఉన్న ప్రతి పోడు భూమికి తక్షణమే పట్టాలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఆదివాసులపై ఫారెస్ట్ అధికారుల దాడులను పూర్తిగా నిలిపివేయాలని కోరారు ఆదివాసులు నివసించే నాన్‌ఏజెన్సీ గ్రామాలను షెడ్యూల్డ్ జాబితాలోకి మార్చాలని తెలిపారు. ఆదివాసీ యువతకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు లభించేలా ప్రత్యేక చట్టాలు తేవాలని కోరారు. ఈ సమస్యలు పరిష్కారమయ్యే వరకు ఐక్యతతో పోరాటాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శి భాగాల రాజన్న, ఎర్మ పున్నం మాట్లాడుతూ ఈ ప్రాంతం లో అటవీ ఉత్పత్తులపై ఆధారపడి జీవిస్తున్న దసలీ రైతుల కు జీవనోపాధి కల్పించడానికి పరిశ్రమ ఏర్పాటు చేశారు కానీ ఈ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల మూలంగా పరిశ్రమ మూతబడి ఎలాంటి జీవనోపాధి లేనటువంటి ఆదివాసీల పై అటవీ అధికారుల దాడి నీ ఖండిస్తున్నామన్నారు స్థానిక మంత్రి వివేక్ కి ఎన్ని సార్లు విన్నవించినా పట్టించుకోకపోవడం లేదన్నారు. ఆదివాసి గ్రామాలకు సరైన రోడ్డు లేక ప్రజలు అష్టకష్టాలు పడుతున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ఆదివాసి గిరిజన సంఘం రాష్ట్ర సహకార కార్యదర్శి పోలం రాజేందర్, జిల్లా ఉపాధ్యక్షులు మల్లేశ్వరి, వృత్తిదారుల రాష్ట్ర నాయకులు ఆశయ, వ్యవసాయ కార్మిక సంఘం భూపాలపల్లి జిల్లా అధ్యక్షులు పోలం రాజేందర్, ఐద్వా జిల్లా కార్యదర్శి ఉమారాణి, రైతు సంఘం జిల్లా కార్యదర్శి చందు, డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి మహేష్, కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి మోహన్, కిసాన్ మిత్ర జిల్లా కోఆర్డినేటర్ సిడం రమేష్, తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా నాయకులు తలండి ముత్తయ్య, సిడం సమ్మక్క, సుమలత, ఆలం మదనయ్య, వెంకన్న, సంపత్, మల్లేష్, శంకర్, తదితరులు పాల్గొన్నారు.



## భజనలతో భద్రతకు భరోసా

**- శ్రావణంలో పోలీసులకు అండగా నిలిచిన భైంసా రూరల్ గ్రామాలు**

**నిర్మల్, ఆగస్టు 13, ప్రభాతవార్త:**

భక్తి, భద్రత రెండూ కలిసి నడిచే అరుదైన దృశ్యం భైంసా రూరల్ పరిధిలో కనిపిస్తోంది. శ్రావణమాసం సందర్భంగా గ్రామాల్లో భజనలు ఊపందుకోగా, అదే సమయంలో దొంగతనాల నివారణకు పోలీసుల రాత్రి గస్తీకి గ్రామస్థులు చేదోడువాదోడుగా నిలుస్తున్నారు. భైంసా రూరల్ పరిధిలో నేరాలకు అడ్డుకట్ట వేసేందుకు పోలీసులు రాత్రివేళల్లో పెట్రోలింగ్‌ను పెంచారు. దీనికి తోడు గ్రామ ప్రజలు స్వచ్ఛందంగా ముందుకొచ్చి సమూహాలుగా ఏర్పడి అప్రమత్తంగా ఉంటున్నారు. భజన ముగిసిన వెంటనే యువకులు, పెద్దలు కలిసి వీధుల్లో గస్తీ తిరుగుతూ పోలీసులకు సహకరిస్తున్నారు. మిర్జాపూర్, వానల్‌పహాడ్, తిమ్మాపూర్ సహా పరిసర గ్రామాల ప్రజలు పోలీసులకు పూర్తి మద్దతు ప్రకటించారు. అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే వెంటనే సమాచారం ఇవ్వాలని, స్వయంగా ఎదుర్కోకుండా పోలీసులకు తెలియజేయాలని నిర్ణయించుకున్నారు. జిల్లా ఎస్పీ డా. జి. జానకి షర్మిల ఆదేశాలతో జిల్లావ్యాప్తంగా ప్రజా భద్రతా చర్యలు కొనసాగుతున్నాయని పోలీసు అధికారులు తెలిపారు. శ్రావణమాసంలో భక్తితో పాటు అప్రమత్తత చూపుతున్న గ్రామస్థుల కృషి ప్రశంసనీయమని పేర్కొన్నారు. ప్రజల నుంచి వచ్చే సమాచారమే నేరాల నియంత్రణకు కీలకమని, అనుమానం వస్తే వెంటనే డయల్ 100కు లేదా సమీప పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించాలని సూచించారు.

## నాపై వస్తున్న నిరాధార ఆరోపణలు అవాస్తవం

**- వార్తలను విశ్వసించవద్దని కార్మికులకు ఐఎన్టీయూసీ నేత జెట్టి శంకర్ రావు విజ్ఞప్తి**

**నస్పూర్, ఆగస్టు 13, ప్రభాతవార్త**

ఇటీవల తనపై వస్తున్న నిరాధార ఆరోపణలు పూర్తిగా అవాస్తవం, వాటిని కార్మికులెవరూ విశ్వసించవద్దని ఐఎన్టీయూసీ సీనియర్ సెంట్రల్ వైస్ ప్రెసిడెంట్ జెట్టి శంకర్ రావు విజ్ఞప్తి చేశారు. గురువారం ఐఎన్టీయూసీ నాయకులతో కలిసి నస్పూర్ ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత 40 ఏళ్లుగా ఐఎన్టీయూసీలో సాధారణ కార్యకర్త స్థాయి నుండి సీనియర్ సెంట్రల్ వైస్ ప్రెసిడెంట్ స్థాయికి ఎదిగానని ఆయన గుర్తుచేశారు. సింగరేణి సంస్థలో తన విధులను ఎల్లప్పుడూ సక్రమంగా నిర్వహిస్తున్నానని, విధి నిర్వహణలో మాస్టర్ పడి బయటకు వచ్చిన దాఖలాలు లేవని శంకర్ రావు స్పష్టం చేశారు. యూనియన్ కార్యకలాపాల కోసం 2014 నుండి ఇప్పటివరకు సుమారు 50 లక్షల రూపాయల సొంత డబ్బులను ఖర్చు చేసినట్లు తెలిపారు. ప్రస్తుతం స్పెషల్ ఏ గ్రేడ్ ఉద్యోగిగా పనిచేస్తున్న నెలకు సుమారు 1.5 లక్షల రూపాయల జీతం వస్తుందని, తనకు ఇంకా రెండు సంవత్సరాల సర్వీస్ ఉందని వివరించారు. వ్యక్తిగత అవసరాల కోసం కొంతమంది వద్ద తీసుకున్న రుణాలను ఖచ్చితంగా తిరిగి చెల్లిస్తానని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో ఐఎన్టీయూసీ నాయకులు గరిగ స్వామి, తిరుపతి రాజు, జీవన్, జోయల్ తదితరులు పాల్గొన్నారు.



# ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయుల సర్దుబాటు, మౌలిక వసతులు కల్పించాలి

## - విద్యాశాఖ కార్యాలయ డోర్‌కు వినతిపత్రం అందజేసిన విద్యార్థి నాయకులు

**మంచిర్యాల జిల్లా ప్రతినిధి, ఆగస్టు 13, ప్రభాతవార్త**



మంచిర్యాల జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా ఉపాధ్యాయులను తక్షణమే సర్దుబాటు చేయడంతో పాటు, పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించాలని డిమాండ్ చేస్తూ వివిధ విద్యార్థి సంఘాల నాయకులు జిల్లా విద్యాశాఖ కార్యాలయాన్ని ఆశ్రయించారు. ఈ మేరకు విద్యాశాఖ అధికారులకు వినతిపత్రం అందజేసేందుకు వెళ్లిన విద్యార్థి నాయకులు సంబంధిత ఏ.డి. కార్యాలయానికి చేరుకున్నారు. వినతిపత్రం స్వీకరించేందుకు అధికారి నిరాకరించడంతో చివరకు విద్యాశాఖ కార్యాలయ డోర్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా విద్యార్థి సంఘాల నాయకులు మాట్లాడుతూ మంచిర్యాల జిల్లాలోని పలు ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా ఉపాధ్యాయులు లేకపోవడంతో విద్యార్థుల చదువులు తీవ్రంగా ప్రభావితమవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికే ఎస్ ఏ1 పరీక్షలు పూర్తవుతున్న దశలోనూ కొన్ని పాఠశాలల్లో పాఠ్య ప్రణాళిక ప్రకారం బోధన పూర్తికాకపోవడం వల్ల విద్యార్థులు విద్యాపరంగా వెనుకబడే పరిస్థితి ఏర్పడుతోందని అన్నారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం, విద్యాశాఖ అధికారులు వెంటనే ఉపాధ్యాయుల సర్దుబాటు చేపట్టాలని డిమాండ్ చేశారు. అలాగే జిల్లాలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో సురక్షితమైన తాగునీరు, సరిపడా మరుగుదొడ్లు, నాణ్యమైన తరగతి గదులు, ప్రహరీ గోడలు, అవసరమైన ఫర్నిచర్ తదితర మౌలిక వసతులు కల్పించాలని కోరారు. విద్యార్థుల సమస్యల పరిష్కారం కోసం వినతిపత్రం అందజేయడానికి వెళ్లిన తమతో టీచర్ల సమస్యల గురించి మీకెందుకు? అంటూ అవహేళనగా మాట్లాడారని, విద్యార్థి సంఘాల తరఫున ఇచ్చే వినతిపత్రాన్ని స్వీకరించబోనని ఏ.డి. చెప్పారని నాయకులు ఆరోపించారు. విద్యార్థుల సమస్యలను పరిష్కరించాల్సిన విద్యాశాఖ అధికారులు వినతిపత్రం స్వీకరించేందుకు కూడా ముందుకు రాకపోవడం బాధాకరమని అన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న పేద, మధ్యతరగతి విద్యార్థుల విద్యా హక్కును కాపాడేందుకు అధికారులు తక్షణమే స్పందించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరతను అధిగమించడంతో పాటు మౌలిక వసతుల సమస్యలను పరిష్కరించి పాఠశాలలను బలోపేతం చేయాలని విద్యార్థి నాయకులు కోరారు. విద్యార్థుల బంగారు భవిష్యత్తు కోసం విద్యాశాఖ అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ విద్యార్థి ఉద్యమ వేదిక రాష్ట్ర కార్యదర్శి చిప్పకుర్తి శ్రీనివాస్, జాతీయ విద్యార్థి సమైక్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చేరాల వంశీ, నేషనల్ స్టూడెంట్ కాంగ్రెస్ మంచిర్యాల జిల్లా అధ్యక్షులు బచ్చలి అభిరామ్, అంబేద్కర్ స్టూడెంట్ ఫెడరేషన్ మంచిర్యాల జిల్లా అధ్యక్షులు అవునూరి ప్రసాద్, విద్యార్థి నాయకులు వేణు, పవన్ కళ్యాణ్ తదితరులు పాల్గొన్నారు.

## గ్రామాల అభివృద్ధి ధ్యేయంగా ముందుకు..

### - మహాగాం, కామోల్ గ్రామాల్లో 6 మహిళా సమైక్య భవనాలు

### ప్రారంభించిన ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్

**భైంసా, ఆగస్టు 13, ప్రభాతవార్త:**

గ్రామాల అభివృద్ధి ధ్యేయంగా ముందుకు సాగుతానని, ప్రతి గ్రామంలో కోట్లాది రూపాయల నిధులతో అభివృద్ధి పనులు చేపడుతున్నామని ముధోల్ ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ తెలిపారు. గురువారం భైంసా మండలంలోని మహాగాం గ్రామంలో రెండు, కామోల్ గ్రామంలో నాలుగు మహిళా సమైక్య భవనాలను ఆయన ప్రారంభించారు. అలాగే కామోల్ గ్రామంలో రూ.12 లక్షల నిధులతో చేపట్టనున్న సీసీ డ్రైనేజీ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. మహాగాం గ్రామంలో ఇప్పటివరకు రూ.80 లక్షలతో సీసీ రోడ్లు, రూ.40 లక్షలతో చెరువు నిర్మాణం, రూ.20 లక్షలతో సమైక్య భవనాల నిర్మాణాలు పూర్తి చేశామన్నారు. విద్యుత్ సబ్‌స్టేషన్, పది ఎకరాల స్థలంలో విశాలమైన గోదాముల నిర్మాణానికి నిధులు మంజూరు చేశామని చెప్పారు. అదేవిధంగా కామోల్ గ్రామంలో సైతం రూ.2 కోట్ల నిధులతో అభివృద్ధి పనులు పూర్తి చేశామన్నారు. అడిగినంత నిధులు ఇస్తూ అభివృద్ధికి సహకరిస్తున్న ఎమ్మెల్యేకు సర్పంచ్‌లు రాజ్యలక్ష్మి, చిన్నయ్య ధన్యవాదాలు తెలిపారు. భైంసా మండలంలో మహిళా సమైక్య భవనాలకు రూ.6.50 కోట్లు మంజూరయ్యాయని జిల్లా డీఆర్‌డీవో విజయలక్ష్మి వెల్లడించారు. మహిళల తరఫున ఆమె ఎమ్మెల్యేకు, ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ శశిభూషణ్, వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్మన్ షిండే ఆనందరావు పటేల్, మాజీ జడ్పీటీసీ శంబలీ రమేష్ పండిత్ పటేల్, నాయకులు, అధికారులు, మాజీ ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



మహిళా సమైక్య భవనాలను ప్రారంభించిన ముధోల్ ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్



## తెలంగాణలో జనసేన బలోపేతానికి కలిసికట్టుగా పనిచేయాలి

### - ఈ నెల 30న మంచిర్యాలలో పార్టీ సమావేశం..

### విజయవంతం చేయాలని పిలుపు

**కాగజ్‌నగర్ రూరల్,ఆగస్టు 13 ప్రభాతవార్త :**

తెలంగాణలో జనసేన పార్టీని మరింత బలోపేతం చేసేందుకు నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని జనసేన పార్టీ పార్లమెంటరీ కోఆర్డినేటర్ మంథని సంపత్‌కుమార్, జాయినింగ్ కమిటీ సభ్యుడు, పెద్దపల్లి పార్లమెంట్ కోఆర్డినేటర్ నరేష్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఈ నెల 30న మంచిర్యాలలో నిర్వహించనున్న పార్టీ సమావేశాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఆదిలాబాద్, పెద్దపల్లి పార్లమెంటరీ నియోజకవర్గాల పరిధిలో పార్టీ కార్యక్రమాలపై చర్చించేందుకు గురువారం కాగజ్‌నగర్‌లో జనసేన నాయకులు, కార్యకర్తల సమావేశం నిర్వహించారు. పార్లమెంటరీ కోఆర్డినేటర్ మంథని సంపత్‌కుమార్, జాయినింగ్ కమిటీ సభ్యుడు నరేష్‌రెడ్డి, అడహాక్ కమిటీ సభ్యుడు మాయా రమేష్ ఆధ్వర్యంలో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా పార్టీ బలోపేతానికి చేపట్టాల్సిన కార్యక్రమాలు, క్షేత్రస్థాయిలో పార్టీని ప్రజల్లోకి తీసుకెళ్లే అంశాలపై చర్చించారు. గ్రామ, మండల, నియోజకవర్గ స్థాయిలో పార్టీ కార్యకలాపాలను విస్తృతం చేయాలని సూచించారు. ప్రజా సమస్యలను గుర్తించి వాటి పరిష్కారం కోసం ప్రజల తరఫున నిరంతరం పోరాడాలని నాయకులు పిలుపునిచ్చారు. పార్టీ అధిష్ఠానం సూచనలు, కార్యక్రమాలను ప్రతి కార్యకర్త సమన్వయంతో ముందుకు తీసుకెళ్లాలని సూచించారు. తెలంగాణలో జనసేనకు బలమైన పునాది ఏర్పడేలా ప్రతి ఒక్కరూ బాధ్యతగా పనిచేయాలని కోరారు. ఈ నెల 30న మంచిర్యాలలో జరిగే సమావేశానికి ఆదిలాబాద్, పెద్దపల్లి పార్లమెంటరీ నియోజకవర్గాల పరిధిలోని నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో సిర్పూర్ నియోజకవర్గ జనసేన నాయకులు అల్లూరి సాయికుమార్, పోతుల ప్రవీణ్, వినేష్‌రెడ్డి, సాయికృష్ణతో పాటు పలువురు కార్యకర్తలు పాల్గొన్నారు.



## ఏకరూప దుస్తుల పంపిణీ

**వాంకిడి, ఆగస్ట్ 13, ప్రభాతవార్త :**

వాంకిడి మండల కేంద్రంలోని అర్జుగుడా ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ఏకరూప దుస్తుల పంపిణీ కార్యక్రమానికి వాంకిడి సర్పంచ్ చూనార్కర్ సతీష్ ముఖ్య అతిథిగా పాల్గొని విద్యార్థులకు ఏకరూప దుస్తులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూవిద్యార్థులు క్రమశిక్షణతో చదువుకుని ఉన్నత స్థాయికి ఎదగాలని సర్పంచ్ సతీష్ సూచించారు . ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు మెరుగైన విద్య, పాఠ్య పుస్తకాలు, కంప్యూటర్లు, పాదారక్షలు,సరఫరా చేస్తుందన్నరు ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని అన్నారు.కార్యక్రమంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు నటరాజ్, అమ్మ ఆదర్శ పాఠశాల చైర్మన్ అల్లోజు సంధ్యారాణి, సింగిల్ విండో చైర్మెన్ జాబోరే పెంటయ్య, పాఠశాల ఉపాధ్యాయులు,ధర్మబాయి వార్డు సభ్యులు మండోకర్ తూర్పు బాయి, విద్యార్థులు, తల్లిదండ్రులు, స్థానిక ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## కోడిపందాలు ఆడుతున్న 10మందిపై కేసు నమోదు

**బెజ్జూర్,ఆగస్టు 13,ప్రభాతవార్త:**

బెజ్జూర్ మండలంలోని పాపన్నపేట శివారులో కోడిపందాలు నిర్వహిస్తున్నారని విశ్వసనీయ సమాచారం మేరకు దాడులు నిర్వహించినట్లు ఎస్ఐ సర్తాజ్ భాషా తెలిపారు.కోడి పందాలు నిర్వహిస్తున్న 10 మందిని ఘటనా స్థలంలో పట్టుకున్నామని,వారి నుంచి 9 మొబైల్ ఫోన్లు,4 ద్విచక్ర వాహనాలు,3 కోడిపుంజులు,2 కత్తులు,3 వేల రూపాయల నగదు స్వాధీనం చేసుకుని వారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.గ్రామాల్లో కోడిపందాలు,జూదం వంటి చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే చట్టపరమైన కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.చట్ట వ్యతిరేక కార్యక్రమాలు జరిగినట్లు తెలిసినట్లయితే సమాచారం అందించాలని సమాచారం అందించిన వారి పేర్లు గోప్యంగా ఉంచబడతాయని అన్నారు.

## బెల్లంపల్లి ఏరియాలో ఉత్తమ ఉద్యోగులు ఎంపిక

**తాండూర్, ఆగస్ట్ 13, ప్రభాతవార్త :**

స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా బెల్లంపల్లి ఏరియాలో ఉత్పత్తి సాధన, విధి నిర్వహణలో ప్రతిభ కనబరిచిన ఉద్యోగులను ఉత్తమ ఉద్యోగులుగా ఎంపిక చేసినట్లు అధికార ప్రతినిధి డి.కిరణ్ బాబు ఒక ప్రకటనలో తెలిపారు. కార్పొరేట్ స్థాయిలో ఉత్తమ ఉద్యోగిగా గజ్జల రాజయ్య (కన్వేయర్ ఆపరేటర్ గోలేటి సిహెచ్పి) ఎంపికయ్యారు. బెల్లంపల్లి ఏరియా ఉత్తమ ఉద్యోగులుగా మెరుగు రమేష్ (ఎం వి డ్రైవర్, గోలేటి సిహెచ్పి),ఎర్ర నరసింహ రాజు (కన్వేయర్ ఆపరేటర్ ఖైరిగూడ ఓసిపి), బొమ్మకంటి భాస్కర చారి (ఈపీ ఆపరేటర్ (ఖైరిగూడ ఓసిపి), బెల్లంపల్లి ఏరియా స్థాయిలో ఉత్తమ విద్యార్థిగా జి.శివకుమార్ (10 వ తరగతి, సింగరేణి హైస్కూల్ ) ఎంపికయ్యారు. ఈనెల 15న కొత్తగూడెం లో జరిగే స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో కార్పొరేట్ స్థాయిలో ఉత్తమ ఉద్యోగిని సన్మానించి జ్ఞాపిక అందజేస్తారు. గోలేటి జిఎం కార్యాలయంలో జరిగే స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలలో బెల్లంపల్లి ఏరియా ఉత్తమ విద్యార్థి, ఉత్తమ ఉద్యోగులను సన్మానించి, జ్ఞాపికలను అందజేయనున్నట్లు ఆయన పేర్కొన్నారు.

## విద్యార్థులకు షూస్ అందజేత

**కెరమెరి,ఆగస్టు 13, ప్రభాతవార్త:**

ప్రభుత్వం విద్యార్థులకు ఉచితంగా పంపిణీ చేసిన షూస్ ని గురువారం సాంగ్వి గ్రామంలోని మండల ప్రజా పరిషత్ పాఠశాలలో సర్పంచ్ కె విమలబాయి చేతుల మీదులుగా విద్యార్థులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు ప్రకాష్ ఉపాధ్యాయులు మాజీ సర్పంచ్ బాపూరావు గ్రామ పెద్దలు మొహర్లే కన్ను పాల్గొన్నారు.





## భైంసా జిన్నింగ్ అండ్ ప్రెస్సింగ్ ఫ్యాక్టరీలో ఘనంగా ఆజాదీ కా అమృత్ మహోత్సవ్

భైంసా, ఆగస్టు 13, ప్రభాతవార్త:

భైంసా జిన్నింగ్ అండ్ ప్రెస్సింగ్ ఫ్యాక్టరీ ప్రాంగణంలో ఆజాదీ కా అమృత్ మహోత్సవ్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా జాతీయ జెండాను ఆవిష్కరించి, జాతీయ గీతాన్ని ఆలపించారు. ఈ సందర్భంగా ప్రజా ట్రస్ట్ చైర్మన్, బీజేపీ సీనియర్ నాయకులు భోస్లే మోహన్ రావు పాటిల్ మాట్లాడుతూ.. ఎందరో మహానుభావుల త్యాగాల ఫలితమే నేటి స్వాతంత్ర్యమని కొనియాడారు. ప్రతి ఇంటిపై జాతీయ జెండాను ఎగురవేసి దేశ ఐక్యతను చాటిచెప్పాలని కోరారు. ఈ కార్యక్రమంలో పలువురు ప్రజాప్రతినిధులు, ప్రజా ట్రస్ట్ లైబ్రరీ అభ్యర్థులు పాల్గొని దేశ స్వాతంత్ర్య సమరయోధులకు నివాళులర్పించారు.



## పీఆర్సీని ప్రకటించి పెండింగ్ బిల్లులు చెల్లించాలి

### ఎమ్మార్వోకు వినతిపత్రం అందజేసిన యుఎస్పిసి నాయకులు

చెన్నూరు, ఆగస్టు 13, ప్రభాతవార్త

యుఎస్పిసి నాలుగు దశల పోరాట కార్యక్రమంలో భాగంగా గురువారం పిఆర్సిని వెంటనే ప్రకటించాలని, పెండింగ్ డీఏలు విడుదల చేయాలని, సీపీఎస్‌ను రద్దు చేయాలని, ఉపాధ్యాయుల పెండింగ్ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ చెన్నూరు మండలం ఎమ్మార్వోకు వినతి పత్రం అందించినట్లు యుఎస్పిసి సభ్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు పత్తి సంతోష్, తోకల శ్రీధర్, మిట్టపల్లి శంకర్, ఎండి ముషీర్, గౌరోజ్ నాగరాజు, కొలకాని రాములు, మాంతయ్య, జనగామ శంకర్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజల ఆరోగ్య పరిరక్షణకు అవసరమైన చర్యలు

### - వార్డు కౌన్సిలర్ దుర్గం సూరజ్

కాగజ్‌నగర్ రూరల్, ఆగస్టు 13 ప్రభాతవార్త :



ప్రజల ఆరోగ్య పరిరక్షణకు అవసరమైన చర్యలు నిరంతరం చేపడతామని వార్డు కౌన్సిలర్ దుర్గం సూరజ్ తెలిపారు. వార్డులో పారిశుధ్య సమస్యలు, దోమల బెడద, ఇతర ప్రజా సమస్యలు ఉంటే వెంటనే తన దృష్టికి తీసుకురావాలని కోరారు. కాగజ్‌నగర్ పట్టణంలోని 25వ వార్డులో దోమల బెడద నివారణకు వార్డు కౌన్సిలర్ దుర్గం సూరజ్ ఆధ్వర్యంలో గురువారం దోమల మందు పిచికారీ చేయించారు. వార్డులోని పలు ప్రాంతాల్లో దోమల సంఖ్య పెరగడంతో స్థానికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్న నేపథ్యంలో ఈ చర్యలు చేపట్టినట్లు తెలిపారు. వార్డులో దోమల ఉత్పత్తికి కారణమయ్యే ప్రాంతాలను గుర్తించి మందును పిచికారీ చేయడంతో పాటు పేరుకుపోయిన చెత్తాచెదారాన్ని తొలగించారు. మురుగు కాలువల్లో చెత్త పేరుకుపోకుండా, కాలువలను పరిశుభ్రంగా ఉంచేందుకు చర్యలు చేపట్టారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం ద్వారా దోమల వ్యాప్తిని అరికట్టవచ్చని స్థానికులకు సూచించారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ దుర్గం సూరజ్ మాట్లాడుతూ..ఈ కార్యక్రమంలో స్థానికులు, పారిశుధ్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## సమాజ హితమే పరమావధిగా

# కొత్తపల్లి వెంకటలక్ష్మి-చంద్రయ్య సొసైటీ సేవలు

### - 16 మందికి ఉచిత కంటి శస్త్రచికిత్సలు.. సొంత ఖర్చులతో రవాణా, భోజన వసతి

### - సొసైటీ వ్యవస్థాపకులు డా. కొత్తపల్లి శ్రీనివాస్





కాగజ్‌నగర్ రూరల్, ఆగస్టు 13 ప్రభాతవార్త :

సమాజ హితమే పరమావధిగా, మానవత్వమే లక్ష్యంగా శ్రీ కొత్తపల్లి వెంకటలక్ష్మి-చంద్రయ్య మెమోరియల్ సర్వీస్ సొసైటీ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య సేవలు కొనసాగుతున్నాయి. పేద, మధ్యతరగతి వర్గాలకు చెందిన కంటి సమస్యల బాధితులకు అండగా నిలుస్తూ సొసైటీ చేపడుతున్న సేవలకు ప్రజల నుంచి ఆదరణ లభిస్తోంది. కాగజ్‌నగర్‌లోని కిమ్స్ మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రిలో ప్రతి మంగళవారం నిర్వహిస్తున్న ఉచిత కంటి వైద్య శిబిరంలో భాగంగా ఈ వారం కంటి శుక్లాల సమస్యతో బాధపడుతున్న 16 మందిని శస్త్రచికిత్సల కోసం ఎంపిక చేశారు. వారికి ఉచితంగా కంటి ఆపరేషన్లు చేయించేందుకు బెల్లంపల్లిలోని లయన్స్ కంటి ఆసుపత్రికి తరలించారు.

**సొంత ఖర్చులతో రవాణా, భోజనం**

ఆపరేషన్ల కోసం ఎంపికైన బాధితులకు సొసైటీ వ్యవస్థాపకులు డా. కొత్తపల్లి శ్రీనివాస్ సొంత ఖర్చులతో సురక్షిత రవాణా సదుపాయాన్ని కల్పించారు. అంతేకాకుండా ఆసుపత్రికి వెళ్లే వారికి ఉచిత భోజన వసతి కూడా ఏర్పాటు చేశారు. పేదలకు ఆర్థిక భారం లేకుండా కంటి శస్త్రచికిత్సలు అందించాలనే ఉద్దేశంతో సొసైటీ ఈ కార్యక్రమాన్ని కొనసాగిస్తోంది.

**తొమ్మిదేళ్లుగా నిరంతర సేవలు**

ఈ సందర్భంగా డా. కొత్తపల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ.. తన తల్లిదండ్రులు కొత్తపల్లి వెంకటలక్ష్మి, చంద్రయ్య జ్ఞాపకార్థం గత తొమ్మిదేళ్లుగా ఉచిత కంటి వైద్య సేవలను కొనసాగిస్తున్నామని తెలిపారు. ఇప్పటివరకు వేలాది మందికి ఉచితంగా కంటి ఆపరేషన్లు చేయించినట్లు చెప్పారు. కంటి చూపు సమస్యలతో బాధపడుతున్న పేదలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఉచిత శస్త్రచికిత్సల ద్వారా తిరిగి చూపు పొందిన వారు తమ పరిసర ప్రాంతాల్లో కంటి సమస్యలతో బాధపడుతున్న వారికి ఈ వైద్య శిబిరాల గురించి తెలియజేసి, సేవలను పొందేలా ప్రోత్సహించాలని సూచించారు. ప్రతి మంగళవారం కాగజ్‌నగర్‌లోని కిమ్స్ మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రిలో నిర్వహిస్తున్న ఉచిత కంటి వైద్య శిబిరాన్ని అవసరమైన వారు వినియోగించుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఐ క్యాంప్ ఇన్‌చార్జి గోపీకృష్ణతో పాటు కిమ్స్ ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

## గిరిజాయి గ్రామంలో ఉచిత వైద్య శిబిరం

బజార్‌హత్నూర్, ఆగస్టు 13, ప్రభాతవార్త:

మండలంలోని గిరిజాయి గ్రామంలో గురువారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరానికి గిరిజాయి, పరిసర ప్రాంతాల ప్రజలు హాజరై వైద్య పరీక్షలు చేయించుకున్నారు. రోగులను పరీక్షించిన వైద్య సిబ్బంది వారికి అవసరమైన మందులను ఉచితంగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ పెందూర్ అరవింద్, ఏఎన్ఎంలు అన్నపూర్ణ, శ్రీలత, ఆశా కార్యకర్తలు సునిత, పద్మ, కౌసల్య, గ్రామస్తులు పాల్గొన్నారు.



## నేడు సీఎం చేతుల మీదుగా పూలే దంపతుల విగ్రహావిష్కరణ

### - తరలివెళ్లిన మాలి సంక్షేమ సంఘం నాయకులు

కాగజ్‌నగర్ రూరల్, ఆగస్టు 13 ప్రభాతవార్త :



మహాత్మా జ్యోతిబాపూలే, సావిత్రిబాయి పూలే దంపతుల విగ్రహాలను శుక్రవారం సాయంత్రం 4 గంటలకు హెచ్ఎండీఏ గ్రౌండ్స్ ఎదురుగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా ఆవిష్కరించనున్నారు. విగ్రహావిష్కరణ కార్యక్రమానికి తెలంగాణ మాలి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లేండుగురే శ్యాంరావు, ఉపాధ్యక్షులు ఆదే నాందేవ్, గుర్నులే నారాయణ, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ గుర్లే శ్రీనివాస్ తరలివెళ్లారు. పూలే దంపతుల ఆశయాలను ప్రతిబింబించేలా సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించడంతో పాటు, వారి జీవితం, సామాజిక సంస్కరణ ఉద్యమం, విద్యా రంగానికి చేసిన సేవలు, అణగారిన వర్గాల అభ్యున్నతికి చేసిన కృషిపై ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టనున్నారు. రాష్ట్రవ్యాప్తంగా బీసీ, వివిధ కుల సంఘాల ప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొననున్న నేపథ్యంలో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మాలి సంఘం నాయకులు పిలుపునిచ్చారు.

## బాలికల ఆరోగ్యానికి హెచ్‌పీవీ టీకా : సర్పంచ్ కోట వేణుగోపాల్

కాగజ్‌నగర్ రూరల్, ఆగస్టు 13 ప్రభాతవార్త :



బారెగూడ గ్రామ పంచాయతీ పరిధిలోని పాకీజానగర్ అంగన్వాడీ కేంద్రంలో బాలికలకు మానవ పాపిలోమా వైరస్ (హెచ్‌పీవీ) టీకాల కార్యక్రమాన్ని సర్పంచ్ కోట వేణుగోపాల్ గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. హెచ్‌పీవీ వైరస్ సోకకుండా నివారించడంతోపాటు భవిష్యత్తులో గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ ముప్పును తగ్గించడంలో టీకా ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు. బాలికలకు సరైన వయసులో టీకా ఇప్పించడం ద్వారా హెచ్‌పీవీ కారణంగా వచ్చే అనారోగ్య సమస్యల నుంచి రక్షణ కల్పించవచ్చన్నారు. తల్లిదండ్రులు టీకా ప్రాధాన్యంపై అవగాహన పెంచుకుని, అర్హులైన బాలికలకు టీకాలు ఇప్పించేందుకు సహకరించాలని సూచించారు. కార్యక్రమంలో వార్డు సభ్యులు ముక్తియార్, రుబీనా తబస్సుమ్, వైద్య సిబ్బంది పార్వతి, ప్రణవి, అంగన్వాడీ టీచర్ సుమిత్ర, ఆశ కార్యకర్త ఆషిక, ప్రజలు పాల్గొన్నారు.





# అమరుల త్యాగ ఫలితమే భారత స్వాతంత్ర్యం

**- దేశభక్తి స్ఫూర్తితో మంచిర్యాలలో ఘనంగా తిరంగ ర్యాలీ - ఐదు వందల మీటర్ల భారీ జాతీయ పతాకంతో విద్యార్థుల ప్రదర్శన**

**మంచిర్యాల, ఆగస్టు 13,ప్రభాతవార్త**

ఎందరో అమరుల త్యాగాలు, పోరాటాల ఫలితంగానే భారతదేశానికి స్వాతంత్రం లభించిందని భారతీయ జనతా పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షులు రఘునాథ్ వెరబెల్లి అన్నారు. ఎనభైవ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పిలుపు మేరకు భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో గురువారం మంచిర్యాల పట్టణంలో ఘనంగా తిరంగ ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు రఘునాథ్ వెరబెల్లి, మంచిర్యాల జిల్లా అధ్యక్షులు నగునూరి వెంకటేశ్వర్ గౌడ్‌తో పాటు వివిధ పాఠశాలలు, కళాశాలలకు చెందిన విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. జాతీయ జెండాలను చేతబూని దేశభక్తి నినాదాలతో విద్యార్థులు పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. ప్రత్యేక ఆకర్షణగా ఐదు వందల మీటర్ల పొడవైన భారీ జాతీయ పతాకాన్ని విద్యార్థులు ప్రదర్శించారు. ఈ సందర్భంగా రఘునాథ్ వెరబెల్లి మాట్లాడుతూ దేశ స్వాతంత్రం కోసం ఎంతోమంది తమ ప్రాణాలను త్యాగం చేశారని, వారి త్యాగాలను ప్రతి భారతీయుడు ఎల్లప్పుడూ స్మరించుకోవాలని అన్నారు. ప్రస్తుతం దేశ ప్రజలు స్వేచ్ఛగా జీవిస్తున్నారంటే దేశ సరిహద్దుల్లో నిరంతరం విధులు నిర్వహిస్తూ దేశాన్ని కాపాడుతున్న సైనికుల త్యాగాలే ప్రధాన కారణమని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ దేశభక్తి భావంతో అమర వీరుల త్యాగాలను స్మరించుకుంటూ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించాలని పిలుపునిచ్చారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పిలుపు మేరకు ప్రతి ఇంటిపై జాతీయ పతాకాన్ని ఎగురవేసి దేశభక్తిని చాటాలని కోరారు. రెండువేల నలభై ఏడునాటికి వికసిత్ భారత్ లక్ష్యాన్ని సాధించే దిశగా కేంద్ర ప్రభుత్వం పనిచేస్తోందని రఘునాథ్ వెరబెల్లి తెలిపారు. దేశ అభివృద్ధిలో ప్రతి ఒక్కరూ భాగస్వాములై భారతదేశాన్ని ప్రపంచంలోనే అగ్రగామి దేశంగా నిలిపేందుకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు నగునూరి వెంకటేశ్వర్ గౌడ్, పెద్దపల్లి పురుషోత్తం, పురుషోత్తం జాజు, కొయ్యల ఎమాజీ, దుర్గం అశోక్, గోలి రాము, వంగపల్లి వెంకటేశ్వర్ రావు, ఎనగందుల కృష్ణమూర్తి, పట్టి వెంకట కృష్ణ, ఆకుల అశోక్ వర్ధన్, ఆడే ప్రేమ్ సింగ్, పచ్చ స్వప్న రాణి, బేర సత్యనారాయణ, రాచర్ల సంతోష్, పానుగంటి మధు, బొడ్డు రఘునందన్ తదితరులు పాల్గొన్నారు.



## విధులలో నిరక్ష్యం వహిస్తే కఠిన చర్యలు

**అసిఫాబాద్, ఆగస్టు 13, ప్రభాతవార్త :**

ప్రభుత్వ కార్యాలయాలలో విధులు నిర్వహించే ఉద్యోగులు, సిబ్బంది తమ విధుల పట్ల నిరక్ష్యం వహిస్తే చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ కె.హరిత అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సముదాయంలోని జిల్లా విద్యాశాఖ అధికారి కార్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసి ఉద్యోగులు, సిబ్బంది హాజరు రిజిస్టర్ను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ కార్యాలయాలలో పనిచేస్తున్న ఉద్యోగులు విధుల పట్ల సమయపాలన పాటించాలని, ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని తెలిపారు. విధులలో నిరక్ష్యం వహించే సిబ్బందిపై చర్యలకు ఉపేక్షించేది లేదని, అనుమతి లేకుండా విధులకు గైర్హాజరయ్యే వారిపై చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు

# విజేతలకు మేయర్ దర్శి మధుకర్ అభినందనలు

**- క్రీడలతో క్రమశిక్షణ, నాయకత్వ లక్షణాలు పెంపొందుతాయి**

**మంచిర్యాల, ఆగస్టు13, ప్రభాతవార్త**




మంచిర్యాలలోని ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణ సంస్థలో నిర్వహించిన వాలీబాల్ టోర్నమెంట్ ముగింపు కార్యక్రమానికి మేయర్ దర్శి మధుకర్ ముఖ్యఅతిథిగా హాజరై విజేతలు, రన్నరప్ జట్లకు బహుమతులు, ట్రోఫీలు అందజేశారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ విద్యతో పాటు క్రీడల్లోనూ విద్యార్థులు రాణించాలని అన్నారు. క్రీడలు శారీరక దృఢత్వంతో పాటు క్రమశిక్షణ, సమయపాలన, జట్టు స్ఫూర్తి, నాయకత్వ లక్షణాలను పెంపొందిస్తాయని తెలిపారు. ప్రభుత్వ విద్యాసంస్థల్లో క్రీడలకు అవసరమైన సౌకర్యాలు కల్పించి యువతలోని ప్రతిభను వెలికితీయడానికి కృషి చేస్తామని పేర్కొన్నారు. క్రీడాకారులు గెలుపోటములను సమానంగా స్వీకరించి క్రీడాస్ఫూర్తితో ముందుకు సాగాలని సూచించారు. కార్యక్రమంలో ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణ సంస్థ ప్రిన్సిపాల్, తెలంగాణ నాన్‌గెజిటెడ్ అధికారుల సంఘం అధ్యక్షుడు శ్రీహరి, కార్యదర్శి శ్రావణ్ కుమార్, తెలంగాణ గెజిటెడ్ అధికారుల సంఘం అధ్యక్షురాలు కె.వనజారెడ్డి, కార్యదర్శి సుధాకర్, సిబ్బంది, క్రీడాకారులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# అతిథి అధ్యాపకుల భర్తీ కోసం దరఖాస్తుల ఆహ్వానం

**లక్షెట్టిపేట, ఆగస్టు 13, ప్రభాతవార్త**

ప్రభుత్వ డిగ్రీ కళాశాల, లక్షెట్టిపేటలో అతిథి అధ్యాపకులుగా పని చేయుటకు గాను దిగువ తెలిపిన సబ్జెక్టులు డిగ్రీలో బోధించుటకు అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డా, మహాత్మా సంతోష్ తెలిపారు. ఖాళీల వివరాలు తెలుగు 1, స్టాటిస్టిక్స్ 1, వీటికోసం దరఖాస్తు చేసుకునే0దుకు అర్హతలు అభ్యర్థులు సంబంధిత సబ్జెక్టులో పి,జీ. పూర్తి చేసి 55 శాతం మార్కులు పొంది ఉండాలి. ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు 50 శాతం మార్కులు ఉంటే సరిపోతుంది. పీహెచ్డీ, నెట్ అభ్యర్థులకు ప్రాధాన్యత ఉంటుంది. డిగ్రీలో బోధన అనుభవం ఉన్నవారికి వెయిటేజీ ఇవ్వబడును. కావున అర్హులైన అభ్యర్థులు తమ దరఖాస్తులను తేదీ 18 సెప్టెంబర్ మంగళవారం సాయంత్రం 4 గంటల లోపు ప్రభుత్వ డిగ్రీ కళాశాల, లక్షెట్టిపేట కార్యాలయంలో సమర్పించాలి. దరఖాస్తుదారులకు మంచిర్యాల ప్రభుత్వ డిగ్రీ కళాశాల 19 ఆగస్టు బుధవారం రోజున ఉదయం 10:30 గంటలకు డెమో, ఇంటర్వ్యూలు నిర్వహించబడును. అభ్యర్థులు ఒరిజినల్ ధృవ పత్రాలతో హాజరు కావాలని ప్రిన్సిపాల్ డాక్టర్ మహాత్మా సంతోష్ ఒక ప్రకటనలో తెలిపారు. నియామకాలు పూర్తిగా తెలంగాణ రాష్ట్ర కళాశాల విద్యాశాఖ కమిషనర్ ఆదేశాలకు లోబడి ఉంటాయని తెలిపారు.



## టేకు, మునగ మొక్కలు పంపిణీకి సిద్ధం

**తాండూర్, ఆగస్టు 13, ప్రభాతవార్త :**

రైతులకు టేకు, మునగ మొక్కలు ఉచితంగా పంపిణీ చేసేందుకు బెల్లంపల్లి, కన్నాలలోని ఉద్యాన నర్సరీలలో సిద్ధంగా ఉన్నాయని ఉద్యాన అధికారి అర్చన తెలిపారు. రైతులు పట్ట పాస్ బుక్, ఆధార్ కార్డు జిరాక్స్ లు, పాస్ పోర్ట్ సైజ్ ఫోటో తీసుకుని రావాలని కోరారు. పూర్తి వివరాల కోస 8977713955 సెల్ నంబర్ ను సంప్రదించాలని ఆమె సూచించారు.



## రేవంతన్న మేలు మర్చిపోలేం

**ఇందిరమ్మ ఇంటితో కల నెరవేరింది.. కన్నీళ్లు పెట్టుకున్న లబ్ధిదారులు**

**నిర్మల్, ఆగస్టు 13, ప్రభాతవార్త:**

ఇల్లు లేని తమకు సొంత గూడు కల్పించారని, ఈ రుణం తీర్చుకోలేమని ఇందిరమ్మ ఇంటి ఆవరణలో లబ్ధిదారులు కన్నీళ్లు పెట్టుకున్నారు. పేదలకు సొంతింటి కల సాకారం చేయడమే లక్ష్యంగా ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాన్ని వేగంగా చేపట్టిందని కాంగ్రెస్ నిర్మల్ నియోజకవర్గ ఇన్‌చార్జి కూచాడి శ్రీహరి రావు అన్నారు. మామడ మండలం కొరటికల్ గ్రామానికి చెందిన పల్లికొండ పద్మ చిన్నయ్య దంపతుల ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశానికి ఆయన హాజరయ్యారు. వేద పండితుల మంత్రోచ్ఛారణల మధ్య లబ్ధిదారులతో గృహప్రవేశం చేయించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా శ్రీహరి రావు మాట్లాడుతూ.. గత ప్రభుత్వం డబుల్ బెడ్‌రూమ్ పేరిట మోసం చేసిందని, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అర్హులైన ప్రతి పేదవాడికి ఇందిరమ్మ ఇల్లు నిర్మించి ఇస్తున్నారని అన్నారు. ఇన్నాళ్లు కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగించిన తమకు సొంత ఇల్లు రావడంపై లబ్ధిదారులు ఆనందం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన మేలును ఎప్పటికీ గుర్తుంచుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు సంతోష్ రాథోడ్, మాజీ సర్పంచ్ నల్లల లింగారెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి గాజుల రవికుమార్, రమేష్ రెడ్డి, గంగారెడ్డి, వికాస్ రెడ్డి, శ్రీనివాస్, రాజన్న, మాజీ ఎంపీపీ వాకిల్, సయ్యద్ అన్వర్, రాజారెడ్డి, చిన్నారెడ్డి పాల్గొన్నారు.

## వెంకట్రావుపేట-నవేగాం రోడ్డుకు నూతన బీటీ రోడ్డు

**- భారీ వాహనాలకు బైపాస్ మార్గం.. ఎమ్మెల్యే హరీశ్‌బాబు**

**సిర్పూర్(టి), ఆగస్టు 13 ప్రభాతవార్త :**

వెంకట్రావుపేట అంతరాష్ట్ర వంతెన నుంచి నవేగాం ఆర్అండ్‌బీ రోడ్డు వరకు నూతన బైపాస్ రోడ్డు నిర్మాణానికి కృషి చేస్తున్నట్లు సిర్పూర్ ఎమ్మెల్యే డా. పాల్వాయి హరీశ్‌బాబు తెలిపారు. మండల కేంద్రంలో గురువారం నిర్వహించిన మండల ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. నూతన బైపాస్ రోడ్డు నిర్మాణం పూర్తయితే భారీ వాహనాలు సిర్పూర్ పట్టణంలోకి రాకుండానే బస్టాండ్‌కు చేరుకునే అవకాశం ఉంటుందన్నారు. రహదారిలో సగభాగం ఇప్పటికే ప్రధానమంత్రి గ్రామీణ సడక్ యోజన కింద మంజూరైందని, మిగిలిన భాగానికి కూడా నిధులు మంజూరు చేయించేందుకు కృషి చేస్తామని చెప్పారు. సిర్పూర్ సామాజిక ఆసుపత్రిలో ప్రస్తుతం నలుగురు వైద్యాధికారులతో పాటు కొత్తగా ఎముకల వైద్యుడు విధుల్లో చేరారని ఎమ్మెల్యే తెలిపారు. ప్రజలు ప్రభుత్వ ఆసుపత్రిలో అందుతున్న వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రైవేటు ఆసుపత్రులకు దీటుగా ప్రభుత్వ ఆసుపత్రులను అభివృద్ధి చేస్తున్నామని పేర్కొన్నారు. అనంతరం వివిధ శాఖల పనితీరుపై శాఖల వారీగా సమీక్ష నిర్వహించి అధికారులకు తగిన సూచనలు చేశారు. సమావేశంలో తహసిల్దార్ రహీముద్దీన్, ఎంపీఓ బోడ వినోద్, స్పెషల్ ఆఫీసర్ ధర్మేందర్, వివిధ గ్రామాల సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

